# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | సోమవారం - 07 - సెప్టెంబర్ - 2026 | సంపుటి : 4 | సంచిక : 95 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్ రాజీనామా చేయాలి: మహేష్ కుమార్ గౌడ్

- ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వంగా కాంగ్రెస్ ముందుకు సాగుతోందని వెల్లడి
- అసెంబ్లీకి హాజరుకాకుండా ప్రతిపక్ష హోదాను అపహాస్యం చేస్తున్నారని విమర్శ
- రెండు సంవత్సరాల్లో భారీ పెట్టుబడులు, వేలాది ఉద్యోగాలు కల్పించామని స్పష్టం
- కుల సర్వేతో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని వ్యాఖ్య



**హైదరాబాద్, సెప్టెంబర్ 6, (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్ష నాయకుడి పదవి అత్యంత బాధ్యతాయుతమైనదని, అలాంటి హోదాలో ఉన్న వ్యక్తి ప్రజల సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అయితే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి దూరంగా ఉంటూ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. ప్రజా సమస్యలపై స్పందించకుండా ప్రతిపక్ష నాయకుడి హోదాను అపహాస్యం చేస్తున్నారని ఆరోపిస్తూ, ఆ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తోందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రజలకు చేరువవుతున్నామని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే

మిగతా 2లో..

## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన అట్టర్ ఫ్లాప్: కేసీఆర్

- ఎర్రవల్లిలో బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం
- అసెంబ్లీ వ్యూహాలపై ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం
- ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపు
- జలాలు, రైతు సమస్యలపై పోరాటం ఉధృతం చేయాలని సూచన



**సిద్దిపేట, సెప్టెంబర్ 6, (తెలంగాణ ముచ్చట్లు):**

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో అన్ని రంగాల్లో విఫలమైందని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విమర్శించారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో ఆయన అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ప్రజా సమస్యలపై మరింత దూకుడుగా పోరాడాలని కేసీఆర్ పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేసీఆర్, తమ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందనే భయంతో

మిగతా 2లో..

## తుక్కుగూడ నర్సు ఘటనపై సీఎం సీరియస్

- మెజిస్ట్రీరియల్ విచారణకు ఆదేశం..
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణకు చర్యలు
- దర్యాప్తు వేగవంతం చేసి పకడ్బందీగా అభియోగపత్రం దాఖలు చేయాలి
- మహిళా ఉద్యోగుల భద్రతపై వ్యవస్థాపరమైన లోపాలను గుర్తించాలి

**హైదరాబాద్,సెప్టెంబర్6(తెలంగాణ ముచ్చట్లు):**

తుక్కుగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సు హత్యాచారానికి గురైన ఘటనపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఘటనకు సంబంధించిన అన్ని అంశాలపై సమగ్ర విచారణ జరిపేందుకు మెజిస్ట్రీరియల్ విచారణకు ఆదేశించారు. బాధితురాలికి న్యాయం జరిగేలా దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా త్వరితగతిన విచారించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఘటనకు దారితీసిన పరిస్థితులతో పాటు బాధితురాలు ఉంటున్న వసతి ప్రదేశంలో భద్రతా ఏర్పాట్లు ఎలా ఉన్నాయి? సంబంధిత సంస్థ నిర్వహణలో ఏమైనా నిర్లక్ష్యం జరిగిందా? మహిళా ఉద్యోగుల భద్రతకు సంబంధించి అమలు చేయాల్సిన నిబంధనలు పాటించారా? అనే అంశాలపై విచారణలో లోతుగా పరిశీలించాలని సీఎం స్పష్టం చేశారు.

### పకడ్బందీగా దర్యాప్తు

కేసులో నిందితుడిని పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్న నేపథ్యంలో దర్యాప్తును అత్యంత పకడ్బందీగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఫోరెన్సిక్ నివేదికలు, సాంకేతిక ఆధారాల సేకరణను వీలైనంత త్వరగా పూర్తి చేసి, సమగ్ర అభియోగపత్రం దాఖలు చేయాలని సూచించారు. కేసు దర్యాప్తును పోలీసు ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.



### ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ

బాధిత కుటుంబానికి సత్వర న్యాయం అందించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టేలా చర్యలు ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. న్యాయశాఖ, పోలీసుశాఖ, అభియోగాల విభాగాలు సమన్వయంతో పనిచేసి కేసు విచారణలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని ఆదేశించారు.

### బాధిత కుటుంబానికి అండగా ప్రభుత్వం

బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఇప్పటికే మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ సీతక్క కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందించడంతో పాటు

మిగతా 2లో..



## రోడ్డు లేక గర్భిణీకి నరకయాతన

- ఎడ్లబండిపై ఆసుపత్రికి తరలింపు
- బురదలో నిలిచిపోయిన 108 అంబులెన్స్
- వాంకిడి ఆసుపత్రిలో సుఖప్రసవం
- తల్లీబిడ్డ క్షేమం

**సర్కేపల్లి, సెప్టెంబర్ 6, (తెలంగాణ ముచ్చట్లు):**

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి మండలం సర్కేపల్లి గ్రామంలో రహదారి సౌకర్యం లేక గర్భిణీ మహిళ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రసవ వేదనతో బాధపడుతున్న కరిష్మా అనే గర్భిణిని ఆసుపత్రికి తరలించేందుకు గ్రామస్థులు ఎడ్లబండిని ఆశ్రయించాల్సి వచ్చింది. గ్రామానికి సరైన రోడ్డు లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రసవ నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అయితే గ్రామానికి వెళ్లే మార్గం బురదమయంగా ఉండటంతో అంబులెన్స్

మిగతా 2లో..



## చలాన్ కోసం ప్రాణాలు పణంగా పెట్టొద్దు

- ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అవగాహన
- వాహనదారులు పోలీసులను చూసి పారిపోవద్దని సూచన
- ప్రమాదకరంగా వాహనాలు ఆపొద్దని పోలీసులకు సూచనలు

**డెస్క్, సెప్టెంబర్ 6, (తెలంగాణ ముచ్చట్లు):**

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనకు విధించే చలాన్ల భయంతో కొందరు వాహనదారులు ప్రమాదకరంగా వాహనాలు నడుపుతూ ప్రాణాలపైకి తెచ్చుకుంటున్న ఘటనలు తరచూ వెలుగుచూస్తున్నాయి. పోలీసులు తనిఖీల కోసం ఆపే సమయంలో ఆగకుండా వేగంగా పారిపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు చోటు

మిగతా 2లో..



## మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి: కవిత

- బంజారాహిల్స్‌లో మీడియాతో మాట్లాడిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు
- సోషల్ మీడియా ట్రోలింగ్‌పై డీజీపీ వైఖరిని ప్రశ్నించిన కవిత
- అసెంబ్లీలో స్పష్టమైన ప్రకటన చేయాలని ముఖ్యమంత్రిని కోరిన టీఆర్ఎస్ అధినేత్రి

2లో

## ప్రాణాలకు ముప్పుగా డీజే సౌండ్స్

- వేడుకల్లో అధిక శబ్దాలు ప్రమాదకరం
- డ్యాన్స్ చేస్తూ కుప్పకూలుతున్న యువత
- కోస్గిలో విద్యార్థి ఆకస్మిక మృతి కలకలం
- శబ్ద కాలుష్యంపై నిపుణుల హెచ్చరిక

**డెస్క్, సెప్టెంబర్ 6, (తెలంగాణ ముచ్చట్లు):**

పెళ్లిళ్లు, ఊరేగింపులు, పండుగలు, శుభకార్యాలు వంటి వేడుకల్లో డీజేల వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. అయితే ఆనందాన్ని పంచాల్సిన ఈ వేడుకలు కొన్ని సందర్భాల్లో విషాదాలకు కారణమవుతున్నాయి. అధిక శబ్దాలతో మోగే డీజేలు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా యువత గంటల తరబడి భారీ శబ్దాల మధ్య డ్యాన్స్ చేయడం వల్ల శారీరక, మానసిక సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొంటున్నారు. ఇటీవలి కాలంలో

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి: కవిత

**హైదరాబాద్, సెప్టెంబర్ 6, (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న సోషల్ మీడియా దూషణలు, ట్రోలింగ్ ఘటనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తనపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై ఇప్పటివరకు తగిన చట్టపరమైన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. మహిళల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవడానికి చట్టాలు ఉన్నప్పటికీ వాటిని సమర్థవంతంగా అమలు చేయడం లేదని విమర్శించారు. మహిళల భద్రత విషయంలో పోలీసులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. సోషల్ మీడియా వేదికల్లో మహిళలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ట్రోలింగ్‌లు ఆందోళనకర స్థాయికి చేరుకున్నాయని కవిత అన్నారు. ప్రజా జీవితంలో ఉన్న మహిళలపైనే ఇలాంటి దాడులు జరుగుతుంటే సాధారణ మహిళల పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలని పేర్కొన్నారు. మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని చట్టాలు స్పష్టంగా చెబుతున్నాయని, అయినప్పటికీ అమలులో నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆరోపించారు. చట్టాలను అమలు చేయడంలో అధికారులు మరింత చురుకుదనం ప్రదర్శించాలని సూచించారు.

తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని కవిత విమర్శించారు. ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు గుర్తింపు, సంక్షేమం, భద్రత కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను పక్కనపెట్టారని ఆరోపించారు. ఉద్యమకారుల కుటుంబాలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. వారికి గుర్తింపు కార్డులు, బీమా, పెన్షన్ వంటి సౌకర్యాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యమకారుల సమస్యలపై స్పష్టమైన కాలపరిమితితో కూడిన ప్రకటన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కవిత కోరారు. ఉద్యమకారులకు సంబంధించిన పూర్తి సమాచారం ప్రభుత్వ వద్ద ఉన్నందున నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం చేయడానికి కారణం లేదన్నారు. కొంతమందికైనా గుర్తింపు కార్డులు జారీ చేసి ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు. ఇచ్చిన హామీల అమలు విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధిని ప్రదర్శించాలని అన్నారు.

బీసీల సంక్షేమం, రిజర్వేషన్ల అంశాలపై కూడా కవిత స్పందించారు. బీసీలకు న్యాయం చేస్తామని చెప్పే పార్టీలు ఆచరణలో మాత్రం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై కేంద్ర ప్రభుత్వంతో సమర్థవంతమైన చర్చలు జరపడం లేదని ఆరోపించారు. కుల గణనలో స్పష్టమైన వివరాలు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రజలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై చర్చ జరగాల్సిన అవసరం ఉందని కవిత అన్నారు. ఫీజు నియంత్రణ, ఉద్యమకారుల సంక్షేమం, మహిళల భద్రత, సామాజిక న్యాయం వంటి అంశాలపై చట్టపరమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని, లేకపోతే ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యంగా ఉండాలని ఆమె పేర్కొన్నారు.

# ప్రాణాలకు ముప్పుగా డీజే సౌండ్స్

(మొదటి పేజీ తరువాయి)

డీజే కార్యక్రమాల్లో పాల్గొంటూ అకస్మాత్తుగా కుప్పకూలిపోయి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. కొద్ది సేపటి క్రితం వరకు ఉత్సాహంగా నృత్యాలు చేసిన వ్యక్తులు ఒక్కసారిగా అపస్మారక స్థితికి చేరుకుని మరణించడం కుటుంబాలను విషాదంలో ముంచేస్తోంది. ఈ సంఘటనలు సమాజంలో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.

తాజాగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కోస్గి ప్రాంతంలో జరిగిన ఓ వేడుకలో విద్యార్థి ఆకస్మికంగా గుండెపోటుతో మరణించడం కలకలం రేపింది. డీజే శబ్దాల మధ్య నృత్యం చేస్తుండగా అస్వస్థతకు గురైన విద్యార్థి కుప్పకూలి ప్రాణాలు కోల్పోయినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం సాధారణంగా 60 డెసిబుల్స్ వరకు ఉన్న శబ్దం మానవులకు సౌకర్యవంతంగా ఉంటుంది. అయితే ఆ స్థాయిని దాటి 80, 100 డెసిబుల్స్ కంటే ఎక్కువ శబ్దాలు వినిపిస్తే చెవులపై, గుండెపై, నాడీ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని చెబుతున్నారు. అధిక శబ్దం కారణంగా రక్తపోటు పెరగడం, ఒత్తిడి అధికమవడం, గుండె స్పందనలో మార్పులు చోటుచేసుకోవచ్చని హెచ్చరిస్తున్నారు.

శబ్ద కాలుష్యం వల్ల వినికిడి లోపాలు మాత్రమే కాకుండా మానసిక ఆందోళన, నిద్రలేమి, ఏకాగ్రత లోపం వంటి సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నవారు అధిక శబ్దాలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. వేడుకల సమయంలో భద్రతా ప్రమాణాలు పాటించడం అత్యవసరమని చెబుతున్నారు. వేడుకలు ఆనందాన్ని పంచే సందర్భాలుగా ఉండాలి గానీ విషాదాలకు కారణం కాకూడదని సామాజికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. డీజే శబ్దాలపై నియంత్రణ విధించడం, అనుమతించిన పరిమితులకు మించి శబ్దం వినిపించకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజలు కూడా తమ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధిక శబ్దాల నుంచి దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన అట్టర్ ఫ్లాప్: కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో పాలన సరిగా నిర్వహించలేకపోతున్న ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో వ్యక్తిగత విమర్శలకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపిస్తూ, ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్య వేదికలను రాజకీయ ఆరోపణలకు ఉపయోగించడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని రైతులు, సాగునీటి సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కేసీఆర్ ఆరోపించారు. కృష్ణా, గోదావరి జలాల అంశంపై బీఆర్‌ఎస్ సభ్యులు ఉధృతంగా పోరాడాలని సూచించారు. రైతులకు అవసరమైన సాగునీరు అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ అంశాన్ని అసెంబ్లీలో బలంగా ప్రస్తావించాలని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం వైఖరిని ప్రజల ముందుంచాలని పిలుపునిచ్చారు.

కాళేశ్వరం, పాలమూరురంగారెడ్డి వంటి కీలక ప్రాజెక్టుల నిర్వహణపై కూడా కేసీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. ఈ ప్రాజెక్టుల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించడం లేదని ఆరోపించారు. ప్రాజెక్టుల పనితీరు, నీటి వినియోగం, సాగునీటి పంపిణీ అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలకు పార్టీ సభ్యులంతా తప్పనిసరిగా హాజరు కావాలని కేసీఆర్ సూచించారు. ప్రతి చర్చలో చురుగ్గా పాల్గొని ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని ఆదేశించారు. కాంగ్రెస్, బీజేపీ విధానాలను ఉభయసభల్లో ఎండగట్టాలని, ప్రజలకు సంబంధించిన అంశాలను ప్రధానంగా ప్రస్తావించాలని అన్నారు. సభల్లో బీఆర్‌ఎస్ వైఖరి ప్రజా ప్రయోజనాలకే అంకితమై ఉండాలని స్పష్టం చేశారు. అసెంబ్లీలో ప్రజల అజెండానే బీఆర్‌ఎస్ అజెండా కావాలని కేసీఆర్ పేర్కొన్నారు. నిరుద్యోగం, రైతు సమస్యలు, సాగునీరు, సంక్షేమ పథకాలు, ఆర్థిక పరిస్థితి వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పార్టీ సభ్యులకు సూచించారు. రానున్న సమావేశాల్లో ప్రజల సమస్యలను బలంగా వినిపిస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకురావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, రాజకీయ పరిస్థితులు, అసెంబ్లీ వ్యూహాలపై విస్తృతంగా చర్చించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్ రాజీనామా చేయాలి: మహేష్ కుమార్ గౌడ్

(మొదటి పేజీ తరువాయి)

తమ లక్ష్యమని తెలిపారు.

గత బీఆర్‌ఎస్ పాలనలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో ప్రజలకు హామీలు ఇచ్చి చివరకు నిరాశపరిచారని ఆయన ఆరోపించారు. ఇళ్లు లేని పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. వైద్య రంగాన్ని కూడా గత ప్రభుత్వం కార్పొరేట్ వ్యవస్థకే పరిమితం చేసిందని విమర్శించారు. విద్యతో పాటు సంస్కారం కూడా అవసరమని కేటీఆర్‌కు సూచించారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గణనీయమైన పురోగతి సాధించిందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాల్లో లక్షా 78 వేల కోట్ల రూపాయల విదేశీ పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, గ్లోబల్ సమ్మిట్ ద్వారా మరో ఐదు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు ఆకర్షించామని తెలిపారు. రానున్న రెండున్నర సంవత్సరాల్లో మరిన్ని పరిశ్రమలు తీసుకువచ్చి పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ కుటుంబానికే ఉద్యోగాలు వచ్చాయని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం ఇప్పటికే 70 వేలకుపైగా ఉద్యోగాలు కల్పించామని అన్నారు.

కుల సర్వే నిర్వహణలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల నేతృత్వంలో కుల సర్వే నిర్వహించామని తెలిపారు. గద్దర్, అందెశ్రీ వంటి ఉద్యమకారులను గత ప్రభుత్వం విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం గద్దర్ పేరిట అవార్డులు ఏర్పాటు చేసి గౌరవించిందని చెప్పారు. జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరించి సామాజిక న్యాయానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చాటిందన్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేయడం ప్రతిపక్షాల హక్కేనని, కానీ అసత్య ప్రచారాలు చేయడం సమంజసం కాదని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రతిపక్షాలు తప్పులు ఎత్తిచూపితే సరిదిద్దుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలంగాణలో అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల మద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తుందనే పూర్తి విశ్వాసం తమకు ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# సింగరేణి కార్మికుల హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- **మంచిర్యాలలో సింగరేణి కార్మికుల సంరక్షణ సదస్సు**

**మంచిర్యాల, సెప్టెంబర్ 6, (తెలంగాణ ముచ్చట్లు):** సింగరేణి కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో కూడా అమలు చేయలేదని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. మంచిర్యాల జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన శ్రీరాంపూర్ డివిజన్ సింగరేణి కార్మికుల సంరక్షణ సదస్సులో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు దివాకర్‌రావు, సింగరేణి కార్మికులు, బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. సదస్సులో మాట్లాడిన నాయకులు, సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని విమర్శించారు. కార్మిక కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకమని, వారి కృషితోనే సంస్థ దేశంలో ప్రముఖ బొగ్గు ఉత్పత్తి సంస్థగా ఎదిగిందని నాయకులు గుర్తు చేశారు. అలాంటి కార్మికుల హక్కులు, సంక్షేమాన్ని విస్మరించడం బాధాకరమని అన్నారు. ఉద్యోగ భద్రత, వైద్య సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి సంపదను పరిరక్షించాల్సిన బాధ్యతను విస్మరించి, సంస్థ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని బీఆర్‌ఎస్ నేతలు విమర్శించారు. సింగరేణి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కార్మికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంస్థను బలోపేతం చేసే నిర్ణయాలే తీసుకోవాలని సూచించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం గతంలో అనేక చర్యలు చేపట్టిందన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమాన్ని ఎప్పటికప్పుడు ప్రాధాన్యంగా తీసుకున్నామని చెప్పారు. ప్రస్తుతం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సదస్సులో పాల్గొన్న కార్మికులు కూడా తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని, కార్మికుల సంక్షేమానికి సంబంధించిన పెండింగ్ అంశాలపై ప్రభుత్వం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలని నిర్ణయించారు.

# చలాన్ కోసం ప్రాణాలు పణంగా పెట్టొద్దు

(మొదటి పేజీ తరువాయి)

చేసుకుని ప్రాణనష్టం సంభవిస్తున్న సందర్భాలు పెరుగుతున్నాయి. నిపుణులు, ట్రాఫిక్ అధికారులు చలాన్ కంటే ప్రాణం విలువైనదని, వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచిస్తున్నారు. ట్రాఫిక్ తనిఖీల సమయంలో పోలీసులు ఆపితే వాహనదారులు తప్పనిసరిగా వాహనాన్ని నిలిపి అవసరమైన పత్రాలు చూపించాలని అధికారులు చెబుతున్నారు. చలాన్ పడుతుందనే భయంతో అకస్మాత్తుగా వేగం పెంచడం, తప్పించుకునేందుకు ప్రమాదకర విన్యాసాలు చేయడం వల్ల కేవలం వాహనదారులకే కాకుండా ఇతర ప్రయాణికులకు, పాదచారులకు కూడా ప్రమాదం ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు. ఇటువంటి చర్యలు చట్టపరంగానూ తీవ్ర పరిణామాలకు దారితీసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. మరోవైపు తనిఖీల నిర్వహణలో పోలీసులు కూడా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వేగంగా వెళ్తున్న వాహనాలను ఒక్కసారిగా అడ్డుకోవడం, రహదారిపైకి దూసుకెళ్లి నిలిపివేయడం వంటి చర్యలు ప్రమాదాలకు కారణమవుతాయని చెబుతున్నారు. భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ చట్టబద్ధమైన పద్ధతుల్లోనే తనిఖీలు నిర్వహించాలని సూచిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో వాహనాల నంబర్లను నమోదు చేసి ఈచలాన్లు విధించడం మరింత సురక్షితమైన మార్గంగా అధికారులు భావిస్తున్నారు. సీసీ కెమెరాలు, ఆటోమేటెడ్ ట్రాఫిక్ మానిటరింగ్ వ్యవస్థల ద్వారా ఉల్లంఘనలను గుర్తించి జరిమానాలు విధించే విధానం ఇప్పటికే అనేక ప్రాంతాల్లో అమలులో ఉంది. దీనివల్ల రోడ్లపై అనవసరమైన ఉద్రిక్తతలు, ప్రమాదాలు తగ్గే అవకాశముందని పేర్కొంటున్నారు. ట్రాఫిక్ నియమాలు ప్రజల భద్రత కోసం రూపొందించబడినవేనని అధికారులు గుర్తు చేస్తున్నారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగించడం, అతివేగం నివారించడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం వంటి నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని చెబుతున్నారు. జరిమానాల నుంచి తప్పించుకోవడం కంటే నిబంధనలు పాటించడం ద్వారా సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని స్పష్టం చేస్తున్నారు. రోడ్డు భద్రత విషయంలో వాహనదారులు, పోలీసులు ఇద్దరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు. చలాన్ భయం వల్ల ప్రాణాలను ప్రమాదంలో పడేయకూడదని, అలాగే చట్ట అమలులో కూడా మానవ ప్రాణాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొంటున్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవడమే రోడ్డు భద్రతకు మూలమని అవగాహన కల్పిస్తున్నారు.

# రోడ్డు లేక గర్భిణీకి నరకయాతన

(మొదటి పేజీ తరువాయి)

మారేపల్లి ప్రాంతం వద్దే నిలిచిపోయింది. దీంతో గర్భిణిని నేరుగా ఇంటి వద్ద నుంచి అంబులెన్స్ వరకు తీసుకురావడం సాధ్యపడలేదు. ఈ నేపథ్యంలో గ్రామస్థులు, కుటుంబ సభ్యులు కలిసి కరిష్మాను ఎడ్లబండిపై అంబులెన్స్ ఉన్న ప్రాంతానికి తరలించారు. బురద రోడ్డులో ప్రయాణిస్తూ ఆమెను అంబులెన్స్ వద్దకు చేర్చారు. అనంతరం వైద్య సిబ్బంది సహాయంతో వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరుకున్న కొద్ది సేపటికే కరిష్మాకు ప్రసవం జరిగింది. వైద్యుల పర్యవేక్షణలో కేవలం పది నిమిషాల్లోనే ఆమె సాధారణ ప్రసవం ద్వారా ఆడశిశువుకు జన్మనిచ్చింది. ప్రసవం విజయవంతంగా పూర్తవడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

వైద్యులు తల్లీబిడ్డల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించగా ఇద్దరూ క్షేమంగానే ఉన్నట్లు తెలిపారు. అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నామని, ప్రస్తుతం ఎలాంటి ఆందోళన అవసరం లేదని పేర్కొన్నారు. ఈ ఘటనతో గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాల అవసరం మరోసారి చర్చనీయాంశమైంది. సర్కేపల్లి గ్రామానికి సరైన రోడ్డు లేకపోవడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని, గ్రామానికి తక్షణమే మెరుగైన రహదారి సౌకర్యం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ మహా ధర్నా

- **ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద కాంగ్రెస్ నిరసన కార్యక్రమం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 6, (తెలంగాణ ముచ్చట్లు):** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద మహా ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిన బాధ్యత కేసీఆర్‌పై ఉందన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడం, నియోజకవర్గ ప్రజల మధ్య పర్యటించకపోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆరోపించారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతలను నిర్వర్తించకుండా పదవిలో కొనసాగడం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధిగా ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడం, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, నియోజకవర్గ ప్రజల అభ్యర్థనలను వినడం వంటి బాధ్యతలు ప్రతి ఎమ్మెల్యేపై ఉంటాయని కాంగ్రెస్ నేతలు తెలిపారు. అయితే కేసీఆర్ ఈ బాధ్యతలను నిర్వర్తించడం లేదని ఆరోపిస్తూ ప్రజల తీర్పును గౌరవించి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో అధికార, ప్రతిపక్ష పాత్రలు రెండూ సమానంగా కీలకమని అన్నారు. ప్రతిపక్ష నాయకుడు ప్రజల తరఫున సభలో గళం వినిపించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధి సభకు హాజరై ప్రజా సమస్యలపై మాట్లాడాలని, లేకపోతే ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని అన్నారు. ధర్నాలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూనే ప్రతిపక్ష వైఖరిని కూడా ప్రశ్నిస్తామని తెలిపారు. ప్రజా ప్రయోజనాల అంశాల్లో బాధ్యతాయుతమైన రాజకీయాలు అవసరమని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండటం ప్రజాప్రతినిధుల ప్రధాన కర్తవ్యమని గుర్తు చేశారు. మహా ధర్నాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి హాజరై ప్రతిపక్ష బాధ్యతలను నిర్వర్తించాలని, లేకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు.

# తుక్కుగూడ నర్సు ఘటనపై సీఎం సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు చేసినట్లు తెలిపారు.

వ్యవస్థాపరమైన లోపాలపై దృష్టి

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఘటనకు కారణమైన వ్యవస్థాపరమైన లోపాలను గుర్తించి సరిదిద్దాలని సీఎం అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగుల భద్రత విషయంలో నిబంధనల అమలుపై సమగ్రంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి వీలైనంత త్వరగా న్యాయం జరిగేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
సోమవారం - 07 - సెప్టెంబర్ - 2026


# సాగునీరు, బీటీ రోడ్డు కోసం ఎమ్మెల్యేను కలిసిన రైతులు



- మాజీ జెడ్పీటీసీ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మేఘారెడ్డిని కలిసిన రైతులు

**పెద్దమందడి,సెప్టెంబర్06(తెలంగాణ ముచ్చట్లు):**వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం బలిజపల్లి, జంగమాయపల్లి గ్రామాలకు చెందిన రైతులు తమ సాగునీరు, రహదారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని కలిసి వినతిచేశారు. వనపర్తి జిల్లా డీసీసీ అధికార ప్రతినిధి, మాజీ జెడ్పీటీసీ కే. రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో రైతులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించారు.కర్నె తండా లిఫ్ట్ ద్వారా బసిరెడ్డి చెరువును నీటితో నింపి, చెరువు నుంచి రైట్ కెనాల్ కాల్వ ద్వారా ఎగువ ప్రాంతాల్లోని ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని రైతులు కోరారు. దీనిపై ఎమ్మెల్యే మేఘారెడ్డి సానుకూలంగా స్పందించి, సంబంధిత అటవీ శాఖ అధికారులతో మాట్లాడి త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాల్వ నిర్మాణానికి భూములు ఇచ్చే రైతులకు పది రోజుల్లో టోకెన్ అమౌంట్ అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.అదేవిధంగా ఎర్రగుంట తండా కట్ట నుంచి రుక్కనపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మించాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. ప్రస్తుతం ఉన్న మట్టి రోడ్డు వర్షాలకు కొట్టుకుపోవడంతో పాటు గుంతలమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రహదారి నిర్మాణానికి సంబంధించిన ఎస్టిమేషన్ సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రైతులు కోరిన సమస్యలపై సానుకూలంగా స్పందించి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి మాజీ జెడ్పీటీసీ రమేష్ గౌడ్, రైతులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పానుగంటి రాములు, బలిజపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బలిజపల్లి, జంగమాయపల్లి గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# మేఘన్నా అభయహస్తం ద్వారా బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**పెద్దమందడి,సెప్టెంబర్06(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలంలోని అమ్మపల్లి గ్రామానికి చెందిన బక్క బాల్ చెన్నయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన నిరుపేద కుటుంబాన్ని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి 'మేఘన్నా అభయహస్తం' ద్వారా ఆదుకున్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని గ్రామ నాయకులు అందజేశారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. చెన్నయ్య కుటుంబ పరిస్థితిని స్థానిక సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు.ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అమ్మపల్లి గ్రామ సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి, ఉప సర్పంచ్ బాబు నాయక్, బి. చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ రమేష్, ఉప సర్పంచ్ ఆంజనేయులు, బాలు, రాముల నాయక్, సి. రమేష్, చిన్న రాములు, గూడెం మన్యం, గ్రామ పెద్ద అర్జునయ్య తదితరులు బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కాలనీ వాసులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# తండ్రి జ్ఞాపకార్థంగా ఆంజనేయ స్వామి దేవాలయానికి ఇన్వర్టర్ బ్యాటరీ విరాళం

**పెద్దమందడి,సెప్టెంబర్06(తెలంగాణ ముచ్చట్లు):**వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయానికి ఎక్సైజ్ ఎస్ఐ వై. శ్రీనివాసులు తన తండ్రి, కీర్తిశేషులు పెద్ద ఎల్లయ్య జ్ఞాపకార్థం ఇన్వర్టర్ బ్యాటరీని విరాళంగా అందజేశారు.తండ్రి జ్ఞాపకార్థంగా ఆంజనేయ స్వామి దేవాలయానికి ఉపయోగపడే వస్తువును అందించాలనే భక్తి భావంతో శ్రీనివాసులు ఇన్వర్టర్ బ్యాటరీని తన తరఫున దేవాలయానికి అందించారు. ఆలయ అవసరాలకు ఉపయోగపడే ఈ విరాళం పట్ల దేవాలయ అర్చకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు శివకుమార్ స్వామి మాట్లాడుతూ.. తండ్రి జ్ఞాపకార్థం దేవాలయానికి సేవా రూపంలో విరాళం అందించడం అభినందనీయమని అన్నారు. భక్తి భావంతో చేపట్టే ఇటువంటి సేవా కార్యక్రమాలు ఆధ్యాత్మికతతో పాటు సామాజిక బాధ్యతకు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు.వై. శ్రీనివాసులు, వారి కుటుంబ సభ్యులకు శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆశీస్సులు, అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని అర్చకులు శివకుమార్ స్వామి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్ ,ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పామాయిల్ సాగు విస్తరణకు ప్రత్యేక చర్యలు

- దేశీయ వంట నూనెల అవసరాలు తీర్చేలా సాగు పెంచాలి.
- రైతుల సంక్షేమం కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తాం.
- దక్షిణాది వ్యవసాయ మంత్రుల సదస్సులో కీలక నిర్ణయాలు: తుమ్మల



**అశ్వారావుపేట, సెప్టెంబర్ 6 (తెలంగాణ ముచ్చట్లు):** అశ్వారావుపేటలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారు. ఆయిల్‌పామ్ డివిజనల్ కార్యాలయంలో రైతులకు ఆయిల్‌పామ్ మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు. అనంతరం పామాయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో నూతనంగా నిర్మించనున్న పామాయిల్ ఫ్యాక్టరీ స్థలాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ దేశంలో వంట నూనెల అవసరాలను తీర్చేందుకు పామాయిల్ సాగును మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. దేశం ప్రతి ఏటా వంట నూనెల దిగుమతుల కోసం సుమారు రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 15 లక్షల ఎకరాల్లోనే పామాయిల్ సాగు జరుగుతోందని, 70 లక్షల ఎకరాల్లో సాగు విస్తరించినప్పుడే దేశీయ వంట నూనెల డిమాండ్‌ను గణనీయంగా తీర్చగలమన్నారు. దేశీయ అవసరాలు తీర్చడంతో పాటు విదేశాలకు ఎగుమతులు చేసే స్థాయికి పామాయిల్ సాగును తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ఈ నెల 18న హైదరాబాద్‌లో దక్షిణ భారత రాష్ట్రాల వ్యవసాయ మంత్రుల సదస్సు నిర్వహించనున్నట్లు తుమ్మల తెలిపారు. పామాయిల్ సాగు విస్తరణ, మద్దతు ధర, రైతాంగ సంక్షేమం వంటి అంశాలపై సదస్సులో చర్చించి, రైతులకు ప్రయోజనం చేకూరేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి చర్యలు చేపడతామని చెప్పారు. చీడపీడలను తట్టుకునే కొత్త రకం పామాయిల్ మొక్కలను రైతులకు అందిస్తున్నామని తుమ్మల తెలిపారు. తక్కువ ఎత్తులో పెరిగేలా పామాయిల్ మొక్కల్లో జన్యుపరమైన మార్పులు చేస్తున్నట్లు చెప్పారు. కొత్త వెరైటీలను అందుబాటులోకి తీసుకురావడంలో కొంత ఆలస్యం కారణంగా మొక్కల పంపిణీలో జాప్యం జరిగిందన్నారు. రైతులకు నాణ్యమైన మొక్కలు అందించి పామాయిల్ సాగును మరింత లాభదాయకంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పామాయిల్ గెలలు కోసేందుకు స్థానిక యువతకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గెలల కోత పనిముట్లను ఆధునీకరించడంతో పాటు రైతులకు, కూలీలకు ప్రయోజనం చేకూరేలా వ్యవస్థను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులతో ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగం తలరాత మారుతుందని తుమ్మల అన్నారు. సీతారామ ప్రాజెక్టు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వరప్రదాయినిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా సాగర్ ఆయకట్టుకు సాగునీటి భరోసా కల్పించామని తెలిపారు. దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లోని పంట పొలాలకు గోదావరి జలాలను తీసుకురావాల్సిన బాధ్యత తనదేనని తుమ్మల స్పష్టం చేశారు. పామాయిల్ తోటల్లో భూగర్భంలో సాగునీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేసుకునేందుకు సహకరించాలని కోరారు. పామాయిల్ సాగు చేసే ప్రతి ప్రాంతంలో డ్రిప్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. అశ్వారావుపేట ప్రాంతం తనకు రాజకీయ జన్మనిచ్చిందని తుమ్మల అన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా అశ్వారావుపేట అభివృద్ధికి కృషి చేశానని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో అశ్వారావుపేటకు మహర్దశ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అశ్వారావుపేటలో అత్యాధునిక సాంకేతికతతో మరో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఖమ్మం నుంచి అశ్వారావుపేట మీదుగా జంగారెడ్డిగూడెం వరకు నాలుగు లేన్ల రహదారి ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు. భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో ఈ ఏడాది నీటి ఎద్దడిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని తుమ్మల సూచించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా చెరువులను నింపడంతో పాటు వచ్చే ఏడాదికి గోదావరి జలాలను మండలాలకు తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు. తనకు జన్మనిచ్చిన ఈ ప్రాంత అభివృద్ధే తన లక్ష్యమని, విద్య, వైద్యం, రహదారులు, వ్యవసాయ రంగాల్లో అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తుమ్మల అన్నారు. "తన శ్వాస ఉన్నంతకాలం అశ్వారావుపేట ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు."

# వెయ్యి రోజుల దగా పాలనపై బీఆర్ఎస్ పోరుబాట

- ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ కరీంనగర్‌లో భారీ ఆటోల ర్యాలీ




**కరీంనగర్, సెప్టెంబర్ 6(తెలంగాణ ముచ్చట్లు ):** కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీల అమలులో తీవ్ర వైఫల్యం చెందిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాట కార్యక్రమం ఐదో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా కరీంనగర్‌లో ఆటో కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహించారు. నగరంలో తాగునీరు, వీధి దీపాలు, శాంతి భద్రతలు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారంతో పాటు బస్తీ దవాఖానాల ఏర్పాటు, ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ ఆటోలతో నగరంలో ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పాల్గొని ఆటో కార్మికులకు సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు పేర్కొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుతో రైతు సంక్షేమం

- గెలల ధర పెరగడంతో రైతుల్లో పెరిగిన భరోసా.
- ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది.
- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ.



**అశ్వారావుపేట, సెప్టెంబరు 6 (తెలంగాణ ముచ్చట్లు):** ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలికంగా మంచి ఆదాయం లభిస్తోందని, గెలల ధర పెరగడంతో రైతుల్లో ఈ పంటపై మరింత నమ్మకం ఏర్పడిందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. అశ్వారావుపేట మండలం నారంవారిగూడెంలోని తెలంగాణ ఆయిల్ ఫెడ్ ప్రాంతీయ కార్యాలయ పరిధిలోని ఆయిల్‌పామ్ మొక్కల తయారీ నర్సరీలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయిల్‌పామ్ గెలల ధర గణనీయంగా పెరిగిందని ఎమ్మెల్యే జారె తెలిపారు. ధరలో తగ్గుదల లేకుండా క్రమంగా పెరుగుతూ ప్రస్తుతం గెలల ధర రూ.24 వేలకుపైగా పలుకుతోందన్నారు. దీంతో ఆయిల్‌పామ్ రైతుల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందని చెప్పారు. గతంలో పంట ధరల విషయంలో రైతుల్లో నెలకొన్న అనిశ్చితి క్రమంగా తొలగిపోతోందని, గిట్టుబాటు ధర లభిస్తుండటంతో ఆయిల్‌పామ్ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. మంచి ధర కొనసాగితే మరింత మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం వివిధ రకాల ప్రోత్సాహకాలు అందిస్తోందని జారె తెలిపారు. నాణ్యమైన మొక్కల పంపిణీతో పాటు బిందు సేద్యానికి రాయితీలు, ఎరువులు, సస్యరక్షణ చర్యలు, సాంకేతిక సహకారం వంటి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. సాగు ప్రారంభ దశలో రైతులకు అవసరమైన సూచనలు, మొక్కల సంరక్షణ, నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం, సస్యరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించడం ద్వారా మంచి దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. రైతులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు సహకరించాలని సూచించారు. ఆయిల్‌పామ్ రైతుల సంక్షేమం, పంటకు గిట్టుబాటు ధర, సాగు విస్తరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషిని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అభినందించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రైతుల ఆదాయం పెంచే పంటలను ప్రోత్సహించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని, ఆ దిశగా ఆయిల్‌పామ్ సాగుకు ఇస్తున్న ప్రోత్సాహం మంచి ఫలితాలను ఇస్తోందన్నారు. రైతులకు అవసరమైన రాయితీలు, ఎరువులు, బిందు సేద్యం, సస్యరక్షణ చర్యలు తదితర సౌకర్యాలను సమర్థంగా అందిస్తే ఆయిల్‌పామ్ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగులో అశ్వారావుపేట ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఇక్కడి వాతావరణం, భౌగోళిక పరిస్థితులు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా ఉండటంతో పెద్ద సంఖ్యలో రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారని తెలిపారు. రైతులకు నాణ్యమైన మొక్కలు అందించడం అత్యంత కీలకమని, నర్సరీల ద్వారా నాణ్యమైన మొక్కలను అందుబాటులోకి తీసుకురావడం వల్ల సాగు విస్తరణకు మరింత ఊతం లభిస్తుందని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు నిరంతరం అవగాహన కల్పిస్తూ, ఆధునిక సాగు పద్ధతులను అందిపుచ్చుకునేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయిల్‌పామ్ పంట రైతులకు దీర్ఘకాలికంగా ఆదాయాన్ని అందించే పంటగా మారుతోందని జారె పేర్కొన్నారు. ఒకసారి తోటను అభివృద్ధి చేసుకున్న తర్వాత సంవత్సరాల పాటు దిగుబడులు పొందే అవకాశం ఉండటంతో రైతులకు స్థిరమైన ఆదాయ వనరుగా ఉపయోగపడుతుందని తెలిపారు. రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచాలంటే వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను ప్రోత్సహించడంతో పాటు మార్కెట్‌లో పంటకు సరైన ధర లభించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు రైతులకు భరోసా కల్పిస్తున్నాయని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగుతో రైతుల జీవితాల్లో సిరులు కురుస్తున్నాయని, రైతుల ఆదాయం పెరిగేలా ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కోరారు. కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఆయిల్‌పామ్ రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, అశ్వారావుపేట మున్సిపల్ చైర్‌పర్సన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, రావు గంగాధర్‌రావు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎం.ఈ.ఎఫ్ జాతీయ కోర్ కమిటీ ఉపాధ్యక్షుడిగా గద్వాల కృష్ణ మాదిగ



**వనపర్తి,సెప్టెంబర్06(తెలంగాణ ముచ్చట్లు-):**మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కోర్ కమిటీ ఉపాధ్యక్షుడిగా వనపర్తి జిల్లాకు చెందిన గద్వాల కృష్ణ మాదిగ నియమితులయ్యారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆశీస్సులతో కింది స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదిగిన గద్వాల కృష్ణకు సంస్థలో కీలక బాధ్యతలు అప్పగించారు. తనను మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కోర్ కమిటీ ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగకు గద్వాల కృష్ణ మాదిగ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన ఎదుగుదలకు, నియామకానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కింది స్థాయి నుంచి నేటి జాతీయ స్థాయికి ఎదగడంలో పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆశీస్సులు, మార్గదర్శకత్వం ఎంతో కీలకంగా నిలిచాయని గద్వాల కృష్ణ మాదిగ పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను గౌరవంగా స్వీకరిస్తున్నానని తెలిపారు. జాతీయ స్థాయిలో తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ మాదిగ ఉద్యోగుల సమాఖ్యను మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు సమాఖ్యను గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మరింత విస్తరించేందుకు కృషి చేస్తానన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మాదిగ ఉద్యోగుల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తానని గద్వాల కృష్ణ మాదిగ తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**ధర్మసాగర్, సెప్టెంబర్ 6(తెలంగాణ ముచ్చట్లు):** ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్ గ్రామానికి చెందిన ఇటుక రాజు ఈశ్వర్ (60) ఆదివారం మధ్యాహ్నం రాంపూర్ గ్రామం వైపు నుంచి తన ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో అదే మార్గంలో వస్తున్న కారు (టీజీ 08 బీసీ 9798) డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా వాహనం నడుపుతూ రాజు ఈశ్వర్‌ను ఢీకొట్టాడు.
ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజు ఈశ్వర్‌ను స్థానికులు 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం 12.38 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.
మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ధర్మసాగర్ పోలీసులు క్రైం నంబర్ 241/2026, బీఎన్ఎస్ 106(1) సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పేద వృద్ధ మహిళలకు మదరమ్మ ట్రస్ట్ చీరల పంపిణీ



- **వృద్ధుల సంక్షేమం ప్రతి ఒక్కరి బాధ్యత: సర్పంచ్ కిరణ్**

**హుజూరాబాద్, సెప్టెంబర్ 6(తెలంగాణ ముచ్చట్లు ):** పేదలు, వృద్ధుల సంక్షేమమే లక్ష్యంగా హుజూరాబాద్‌కు చెందిన కంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం చల్లపల్లి-ఇందిరానగర్ గ్రామంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ సూచించిన 40 మంది పేద వృద్ధ మహిళలకు ట్రస్ట్ ఆధ్వర్యంలో చీరలను పంపిణీ చేశారు. ట్రస్ట్ నిర్వాహకులు, సామాజిక కార్యకర్త డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్, సర్పంచ్ కోడిగూటి కిరణ్ చేతుల మీదుగా వృద్ధ మహిళలకు చీరలను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ కోడిగూటి కిరణ్ మాట్లాడుతూ వృద్ధులు సమాజంలో ఎంతో గౌరవానికి అర్హులని అన్నారు. వృద్ధులకు సమయానికి ఆహారం అందేలా చూడటంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. జీవిత చరమాంకంలో ఉన్న వృద్ధులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా, సంతోషంగా జీవించేలా చూడటం కుటుంబ సభ్యులతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.పేదలు, వృద్ధ మహిళలను గుర్తించి వారికి అవసరమైన సమయంలో అండగా నిలుస్తున్న కంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ సేవలను ఆయన అభినందించారు. మదరమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం పేదలకు చీరలు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. ఈ ఏడాది తమ గ్రామంలోని 40 మంది పేద వృద్ధ మహిళలను గుర్తించి వారికి చీరలు అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. గ్రామ పేద వృద్ధ మహిళలకు వస్త్రాలు అందించినందుకు ట్రస్ట్ నిర్వాహకులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు తమ వంతు సహాయం అందించాలనే ఉద్దేశంతో మదరమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా పేదలు, వృద్ధులు, అవసరంలో ఉన్న వారికి తమకు సాధ్యమైన మేరకు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కే. శ్రీధర్ రెడ్డి, జీవన్తో పాటు గ్రామ ప్రజలు, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు. చీరలు అందుకున్న వృద్ధ మహిళలు ట్రస్ట్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# కందుగులలో బీఆర్‌ఎస్ ఆటో ర్యాలీ



- **కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై నిరసన.**
- **హామీలు అమలు చేయాలని డిమాండ్**

**హుజురాబాద్, సెప్టెంబర్ 6(తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలు, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సూచన మేరకు హుజురాబాద్ మండలం కందుగుల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం భారీ ఆటో ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ ఆటో డ్రైవర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా గ్రామ ఉప సర్పంచ్ మంద సతీష్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేల ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి చాలాకాలం గడిచినా నేటికీ ఆటో డ్రైవర్లకు ఒక్క రూపాయి కూడా అందలేదని విమర్శించారు. అలాగే గత రెండేళ్లుగా గ్రామపంచాయతీలకు సరైన నిధులు కేటాయించకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని అన్నారు. గ్రామపంచాయతీలకు తక్షణమే నిధులు విడుదల చేసి పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేయాలని, ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీని అమలు చేయాలని సతీష్ గౌడ్ డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ ర్యాలీలో గ్రామ సీనియర్ నాయకులు బెల్లి రాజయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు బెల్లి రవి, మాజీ ఎంపీటీసీ కాసం పద్మ రఘుపతిరెడ్డి, వార్డు సభ్యులు గోలి అరణ్య విజయకుమార్, మంద కవిత శ్రీనివాస్, తలకొక్కుల బిక్షపతి, ఎలగందుల రమేశ్‌తో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేశరాజ్‌పల్లిలో అభివృద్ధి పనులకు భూమిపూజ

- **నూతన గ్రామపంచాయతీ, విశ్వబ్రాహ్మణ సంఘ భవనాలకు శంకుస్థాపన**
- **ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేతుల మీదుగా పనులకు శ్రీకారం**



**కరీంనగర్, సెప్టెంబర్ 6 (తెలంగాణ ముచ్చట్లు):** చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలం దేశరాజ్‌పల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణంతో పాటు విశ్వబ్రాహ్మణ కుల సంఘ భవన నిర్మాణానికి చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నూతన గ్రామపంచాయతీ భవనం అందుబాటులోకి వస్తే ప్రజలకు పాలనాపరమైన సేవలు మరింత సులభంగా అందుతాయని తెలిపారు. విశ్వబ్రాహ్మణ కుల సంఘ భవనం నిర్మాణం పూర్తయితే సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మరిన్ని పనులను దశలవారీగా చేపట్టేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం.!

- **స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా ఎదగాలి.**
- **అవకాశాలను అందిపుచ్చుకోవాలి.**
- **ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్.**



**సత్తుపల్లి, సెప్టెంబర్ 6 (తెలంగాణ ముచ్చట్లు):** మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, నైపుణ్యాలను ఉపాధి అవకాశాలుగా మార్చుకునేలా ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తోందని తెలిపారు. మహిళలు అవకాశాల కోసం ఎదురుచూడకుండా.. అవకాశాలను సృష్టించుకునే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పెనుబల్లి మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి, స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యుల కోసం సెర్ప్, ఎస్‌బీఐ-ఆర్‌సెట్ఐ ఖమ్మం, ఉషాకిరణాలు మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణ కేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శిక్షణ కేంద్రాన్ని పరిశీలించి మహిళలకు అందిస్తున్న శిక్షణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంఘాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నాయని అన్నారు. మహిళలు సంఘాలుగా ఏర్పడి పొదుపు, రుణాలు, స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా ఆర్థికంగా ఎదుగుతున్న తీరు అభినందనీయమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, శిక్షణలు, ఇతర ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవడంతో పాటు సొంతంగా వ్యాపారాలు నిర్వహించే స్థాయికి ఎదగాలని సూచించారు. జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణ ద్వారా మహిళలకు చేతివృత్తి నైపుణ్యంతో పాటు స్థిరమైన ఆదాయ మార్గం ఏర్పడే అవకాశం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు అనుకూలమైన జ్యూట్ బ్యాగులకు మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేసి మార్కెటింగ్‌పై కూడా దృష్టి సారించాలని సూచించారు. ఒక మహిళ ఆర్థికంగా ఎదిగితే ఆ ప్రభావం మొత్తం కుటుంబంపై ఉంటుందని, మహిళల ఆర్థిక బలోపేతంతో సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. మహిళా సంఘాల ద్వారా సున్నా వడ్డీ రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం, పెట్రోల్ బంకుల ఏర్పాటు వంటి పలు కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని మహిళలు తమ కుటుంబాలకు ఆర్థిక అండగా నిలవాలని కోరారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశయమని ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. మహిళలు చిన్నచిన్న స్వయం ఉపాధి కార్యక్రమాలతో ప్రారంభించి క్రమంగా వ్యాపారవేత్తలుగా ఎదగాలని, తాము ఎదగడంతో పాటు మరికొందరు మహిళలకు ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. మహిళా సంఘాల ఐక్యత, కృషి, ప్రభుత్వ సహకారం కలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆర్థిక పరిస్థితుల్లో గణనీయమైన మార్పు సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజ ప్రభాకర్‌చౌదరి, ఏపీఎం, ఏపీవో, ఇన్‌చార్జి ఎంపీడీవో, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, సత్తుపల్లి కౌన్సిలర్ తోట సుజలారాణి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బల్లి మనీషా, ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 15వ బెటాలియన్‌లో ఘనంగా బంజారా తీజ్ ముగింపు వేడుకలు

- **సంప్రదాయాలు, సంస్కృతికి అద్దం పట్టిన వేడుకలు.**



**సత్తుపల్లి, సెప్టెంబర్ 6 (తెలంగాణ ముచ్చట్లు):** బంజారా సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ప్రతిబింబించే తీజ్ పండుగ ముగింపు వేడుకలు బి. గంగారం గ్రామంలోని 15వ బెటాలియన్ క్యాంపస్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బెటాలియన్ ప్రాంగణం తీజ్ పండుగ సందడితో కళకళలాడింది. బంజారా సంప్రదాయ దుస్తులు, సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ వేడుకలతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. కార్యక్రమానికి 15వ బెటాలియన్ కమాండెంట్ ఎన్. పెద్ద బాబు ముఖ్యఅతిథిగా హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. బెటాలియన్ అధికారులు, సిబ్బంది, బంజారా సమాజ పెద్దలు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తీజ్ పండుగ సందర్భంగా బంజారా సంస్కృతిలోని ప్రత్యేకతలను ప్రతిబింబించేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సంప్రదాయ ఆచారాలు, పాటలు, నృత్యాలు, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కుటుంబ సభ్యులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొనడంతో కార్యక్రమం ఆద్యంతం సందడిగా సాగింది. బంజారా సమాజానికి తీజ్ పండుగకు ఉన్న ప్రత్యేకతను ఈ సందర్భంగా పలువురు గుర్తుచేసుకున్నారు. తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయాలను కాపాడుకుంటూ వాటి విశిష్టతను భావితరాలకు అందించాల్సిన అవసరాన్ని చాటిచెప్పారు. ఈ సందర్భంగా కమాండెంట్ ఎన్. పెద్ద బాబు మాట్లాడుతూ బంజారా సమాజానికి తీజ్ పండుగ ఎంతో విశిష్టమైనదన్నారు. సంస్కృతి, సంప్రదాయాలు ఒక సమాజానికి ప్రత్యేక గుర్తింపునిస్తాయని, వాటిని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. తీజ్ వంటి పండుగలు కుటుంబ సభ్యులను, సమాజాన్ని ఒక్కతాటిపైకి తీసుకురావడంతో పాటు ఐక్యతా భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. వేడుకలను సమన్వయంతో నిర్వహించి విజయవంతం చేసిన నిర్వాహక కమిటీ సభ్యులు, బెటాలియన్ అధికారులు, సిబ్బందిని కమాండెంట్ అభినందించారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఆనందోత్సాహాలు, సంప్రదాయ కళారూపాలు, కుటుంబ సభ్యుల సందడితో బి. గంగారం గ్రామంలోని 15వ బెటాలియన్ క్యాంపస్‌లో నిర్వహించిన తీజ్ ముగింపు వేడుకలు ఘనంగా ముగిశాయి.

# యువ సమరభేరి సక్సెస్‌తో బీజేపీ, కాంగ్రెస్‌లో వణుకు

- **కరీంనగర్ అభివృద్ధిపై బండి సంజయ్, నగర పాలనపై మేయర్ విఫలం..**
- **బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ ధ్వజం**




**కరీంనగర్, సెప్టెంబర్ 6(తెలంగాణ ముచ్చట్లు ):** కరీంనగర్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన విద్యార్థి, యువ సమరభేరి సభ అపూర్వ విజయాన్ని సాధించడంతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో భయం మొదలైందని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ అన్నారు. సభ విజయవంతం కాలేదంటూ మేయర్ కోలగాని శ్రీనివాస్ వ్యాఖ్యలు చేయడం బీజేపీ భయానికి నిదర్శనమని పేర్కొన్నారు. రెండుసార్లు ఎంపీగా గెలిచిన బండి సంజయ్ కరీంనగర్ అభివృద్ధికి చేసిందేమీ లేదని హరిశంకర్ విమర్శించారు. బీజేపీ నగరపాలక సంస్థలో అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా కేంద్రం నుంచి ఒక్క రూపాయి నిధులు తీసుకురాలేదని ఆరోపించారు. కేవలం జనరల్ ఫండ్స్‌తో పనులు చేపట్టి వాటికి ప్రారంభోత్సవాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. ఏళ్లు గడుస్తున్నా రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తి కాకపోవడం బండి సంజయ్ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. మరోవైపు కరీంనగర్ నగరంలో పారిశుధ్యం పూర్తిగా పడకేసిందని, మేయర్‌గా కోలగాని శ్రీనివాస్ పాలనలో విఫలమయ్యారని విమర్శించారు. అధికారులపై మేయర్‌కు ఎలాంటి నియంత్రణ లేదని ఆరోపించారు.
నగర సమస్యలపై సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి, అనంతరం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పిస్తామని హరిశంకర్ తెలిపారు. నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పాలకవర్గం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుగ్గిళ్ల జయశ్రీ-శ్రీనివాస్, షేక్ యూసుఫ్, మాజీ కార్పొరేటర్లు గందె మాధవి-మహేష్, నందెల్లి రమాదేవి, దిండిగాల మహేష్, కంసాల శ్రీనివాస్, ఎడ్ల అశోక్, బోనాల శ్రీకాంత్, నాంపల్లి శ్రీనివాస్, నక్క కృష్ణ, జక్కని ఉమాపతి, నాయకులు గడ్డం ప్రశాంత్ రెడ్డి, సుంకిశాల సంపత్ రావు, నేతి రవివర్మ, గంగాధర చందు, పటేల్ సుధీర్ రెడ్డి, నారదాసు వసంతరావు, అరే రవి, తొంటి రాజేందర్, ఎడబోయిన శ్రీనివాస్ రెడ్డి, నయీమ్, చేతి చంద్రశేఖర్, మంతిని కిరణ్, పిట్టల శ్రీనివాస్, మిడిదొడ్డి నవీన్, చొక్కారపు చంద్రం, మేచినేని పవన్, మహిళా నాయకురాళ్లు కంజర్ల రేణుక, గంటల రేణుకతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాల సాధనకు యువత ఐక్యంగా కృషి



**ఎల్కతుర్తి, సెప్టెంబర్ 6 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్ గ్రామంలో అంబేద్కర్ యూత్ క్లబ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంబేద్కర్ యూత్ క్లబ్ అధ్యక్షునిగా జూపాక రాహుల్, ఉపాధ్యక్షునిగా సాయికిరణ్, ప్రధాన కార్యదర్శిగా పోగుల భరత్, కోశాధికారిగా నమిండ్ల శివకుమార్, సహాయ కార్యదర్శిగా మారేపల్లి ఆకాష్ ఎన్నికయ్యారు.కార్యవర్గ సభ్యులుగా దిలీప్, అక్షిత్, సంజయ్, కళ్యాణ్, వరుణ్ తేజ్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు జూపాక రాహుల్ మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు యువతను ఐక్యం చేస్తామని తెలిపారు. గ్రామంలో యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు విద్య, క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో యువతను భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు. అంబేద్కర్ యూత్ క్లబ్‌ను బలోపేతం చేసి గ్రామ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత సభ్యులు పాల్గొని నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఐక్యత, పరస్పర గౌరవంతోనే శాంతియుత సమాజ నిర్మాణం



- **పిల్లలకు విద్యతో పాటు నైతిక విలువలు నేర్పాలి**
- **మహిళా విద్యావేత్తల రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు**


**ఖమ్మం బ్యూరో , సెప్టెంబర్ 6(తెలంగాణ ముచ్చట్లు):** జమాతే ఇస్లామీ హింద్ ఖమ్మం సెంట్రల్ శాఖ ఆధ్వర్యంలో అజీజ్ గల్లీలోని జమాత్ కార్యాలయంలో మహిళా విద్యావేత్తల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సెంట్రల్ శాఖ అధ్యక్షురాలు అస్ఫియా అంజుమ్ అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రేహానా (ఐఎంఏ అధ్యక్షురాలు) మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరూ ఐక్యత, పరస్పర గౌరవం, సహకారంతో కలిసి పనిచేయాలని అన్నారు. సమస్యల పరిష్కారానికి వివిధ వర్గాల ప్రజలు పరస్పరం చర్చించుకుని, ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకోవాలని సూచించారు.సమస్యలను ఎదుర్కొంటున్న బాధితులకు ఆహారం, వైద్యం, విద్య, ఆర్థిక సహాయం, మానసిక ధైర్యం అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా చూడాలని, అందరూ కలిసికట్టుగా పనిచేసినప్పుడే శాంతియుతమైన, న్యాయమైన, ప్రేమతో కూడిన సమాజాన్ని నిర్మించగలమని పేర్కొన్నారు.మరో అతిథిగా పాల్గొన్న సబ్ ఇన్‌స్పెక్టర్ షాహిన్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి విద్యాబుద్ధులతో పాటు తల్లిదండ్రులు, గురువులు, సమాజంలోని ఇతరులతో ఎలా మెలగాలో చిన్ననాటి నుంచే నేర్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రస్తుతం కొంతమంది పిల్లలు చిన్న వయసులోనే గంజాయి వంటి మాదక పదార్థాలకు, మొబైల్ గేమ్స్‌కు అలవాటు పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలను చెడు అలవాట్లకు దూరంగా ఉంచేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

డాక్టర్ అమీరా మాట్లాడుతూ మానవులందరూ పరస్పరం సోదర సోదరీమణులుగా భావించుకుని, ఒకరినొకరు గౌరవించుకున్నప్పుడే సమాజంలో శాంతి, సామరస్యాలు మరింత పెంపొందుతాయని అన్నారు. పరస్పర గౌరవం, మానవత్వం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.జమాతే ఇస్లామీ హింద్ ఖమ్మం పీఆర్ కన్వీనర్ హాజిరా మాట్లాడుతూ తల్లి సేవకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. తల్లిని ప్రేమించి, గౌరవించి, సేవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ సంతానానికి ఉత్తమ విద్యను అందించడంతో పాటు నైతిక విలువలను చిన్ననాటి నుంచే నేర్పించాలని, భావితరాల సంక్షేమానికి ఇది ఎంతో అవసరమని ప్రవక్త ముహమ్మద్ (స) బోధనలు తెలియజేస్తున్నాయని అన్నారు.జమాతే ఇస్లామీ హింద్ నగర శాఖ అధ్యక్షురాలు అస్మా అంజుమ్ మాట్లాడుతూ ప్రవక్త ముహమ్మద్ (స) జీవితం మనందరికీ ఆదర్శప్రాయమని అన్నారు. ఆయన ప్రజల పట్ల ఎంతో జాలి, కరుణ, ఆదరణ చూపేవారని, తన మాటల ద్వారా గానీ, చేతల ద్వారా గానీ ఎవరినీ ఇబ్బంది పెట్టేవారు కాదని పేర్కొన్నారు. మనమంతా ప్రవక్త (స) జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని మన జీవితాలను చక్కదిద్దుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న మహిళా విద్యావేత్తలు కే. స్వాతి, ఎస్. మీనా, అర్షియా, డాక్టర్ జేబా నస్రీన్, డాక్టర్ హీనా, నాసిహా, షమీమ్, నసీమా, సఫూరా, సఫియా పర్వీన్, కలీషా, అతియా ముంతాజ్, వసీం, గుల్రేజ్, మతీన్ తదితరులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ ఉపాధ్యక్షురాలు షాజియా, సభ్యులు సైదా సుల్తానా, నూరి అఫ్షా, సుమయ్య నస్రీన్, అఫ్రోజ్, సీమ అతహర్, సమీనా, షాకిరా, షాహిదా, ఫైజా, సీమా సైద్ మోమీనా, రఫికా, అయేషా తదితరులు పాల్గొన్నారు.

## ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడిగా మంగరాయి వెంకటేష్

- **ఎరుకల సంఘాన్ని బలోపేతం చేయాలి**
- **రాష్ట్ర అధ్యక్షులు పొన్నకల్ కృష్ణయ్య**



**మహబూబ్‌నగర్,సెప్టెంబరు06(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ఎరుకల సంక్షేమ సంఘాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పొన్నకల్ ఎలుసరి కృష్ణయ్య పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళాభవన్‌లో నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర గౌరవాధ్యక్షులు, విశ్రాంత ఉప కలెక్టర్ మాన్‌పాడు బాలయ్య, రాష్ట్ర అధ్యక్షులు ఎలుసరి కృష్ణయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సంఘంలో నూతనంగా చేరిన ఎలుసరి బాలరాజు, మంగరాయి వెంకటేష్, ఎలుసరి శ్రీనివాసులు, నల్గొండ శాంతయ్య, నాగసారుతు పవన్‌కుమార్ తదితరులకు కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ ఎరుకల జాతి సంక్షేమం, ఆత్మగౌరవం, అభ్యున్నతి, హక్కుల సాధన కోసం గత 25 ఏళ్లుగా తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎరుకల విద్యావంతులు, మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, యువత సంఘంతో కలిసి వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. త్వరలో అన్ని మండలాలు, జిల్లాల్లో నూతన కమిటీలను ఏర్పాటు చేసి సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.సంఘం విస్తరణలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేసి జిల్లా అధ్యక్షుడిగా మంగరాయి వెంకటేష్, ఉపాధ్యక్షులుగా ఎలుసరి బాలరాజు, నల్గొండ శాంతయ్యలను నియమించినట్లు కృష్ణయ్య ప్రకటించారు.నూతన జిల్లా అధ్యక్షుడు మంగరాయి వెంకటేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో సంఘాన్ని బలోపేతం చేసి, ఎరుకల జాతి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. జాతి అభ్యున్నతి, హక్కుల సాధన కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుసరి తిరుమలేశు, ఎలుసరి రామస్వామి, ముద్దని చెన్నయ్య, కుంభ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## వీణవంకలో బీఆర్ఎస్ ధర్నా.. ప్రభుత్వానికి డిమాండ్ల వెల్లువ

- **ఆటో కార్మికులకు రూ.12 వేల సాయం..**
- **కల్వల ప్రాజెక్టు పనులు వెంటనే చేపట్టాలి**



**వీణవంక, సెప్టెంబర్ 06 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా వీణవంక బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ ధర్నా నిర్వహించినట్లు నాయకులు తెలిపారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఆటో కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ప్రతి ఆటో కార్మికుడికి రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే కల్వల ప్రాజెక్టు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి రైతులకు సాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. ఇసుక లారీల రాకపోకల కారణంగా వీణవంక మండలంలోని పలు రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని నాయకులు ఆరోపించారు. గుంతలమయంగా మారిన రోడ్లను తక్షణమే మరమ్మతులు చేపట్టి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రజలు, రైతులు, ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.

## టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా కార్యదర్శిగా అకినపల్లి వెంకటేష్



**ఇల్లందకుంట సెప్టెంబర్ 06 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం కనగర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అకినపల్లి వెంకటేష్ టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది. హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వొడితల ప్రణవ్ అకినపల్లి వెంకటేష్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తన నియామకానికి సహకరించిన జిల్లా చైర్మన్ కొరివి అరుణ్ కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వొడితల ప్రణవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. తనకు మద్దతుగా నిలిచిన ఇల్లందకుంట మండల, హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రాబోయే రోజుల్లో పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ఎస్సీ వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని అకినపల్లి వెంకటేష్ స్పష్టం చేశారు.

## వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో ఆటో కార్మికులకు ఒరిగిందేమిటి?





- **రూ.12 వేల ఆర్థిక సాయం వెంటనే అమలు చేయాలి**
- **జమ్మికుంటలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆటో కార్మికుల నిరసన ర్యాలీ**

**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 06 (తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల వైఫల్య పాలనను నిరసిస్తూ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు జమ్మికుంట పట్టణంలో ఆదివారం ఆటో కార్మికులకు మద్దతుగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు.

ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పాల్గొని ఆటో కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారీ సంపాదనతో కుటుంబాలను పోషించుకుంటున్న ఆటో కార్మికుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోందన్నారు. ఆదాయం తగ్గిపోవడంతో ఆటో కిస్తీలు, ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు భరించలేక అనేక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఆటో కార్మికులు, పేదలు, మధ్యతరగతి ప్రజల సమస్యలను పట్టించుకోకుండా వైఫల్య పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆటో కార్మికులకు అందిన సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం హామీ ఇచ్చిన రూ.12 వేల ఆర్థిక సాయాన్ని వెంటనే అమలు చేయాలని, ఆటో కార్మికులకు సబ్సిడీ రుణాలు అందించాలని కోరారు. అలాగే ఆధునిక ఎలక్ట్రిక్ ఆటోలను అందించి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పేద, మధ్యతరగతి కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ఉండాలని చైర్మన్ అన్నారు. ఆటో కార్మికులు, చిరు వ్యాపారులు, కార్మిక వర్గాల సమస్యలను ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించాలని కోరారు. ఆటో కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు, పీఏసీఎస్ చైర్మన్ పొన్నగంటి సంపత్, పొడేటి రామస్వామి, పోల్నేని సత్యనారాయణరావు, కేడీసీసీ వైస్ చైర్మన్ పింగళి రమేష్, బీఆర్ఎస్ నాయకులు, ఆటో యూనియన్ నాయకులు, పెద్ద సంఖ్యలో ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## నేడు..భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ప్రతిపాదించిన స్థలాల పరిశీలన

- **ఏఏఐ ఉన్నతాధికారులతో కలిసి పాల్గొననున్న ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 6(తెలంగాణ ముచ్చట్లు):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాలపై కసరత్తు మొదలైంది. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి సోమవారం ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) వివిధ విభాగాల ఉన్నతాధికారులతో కూడిన బృందంతో కలిసి ఆయా ప్రాంతాలను పరిశీలించనున్నారు. గతంలో విమానాశ్రయం కోసం ప్రతిపాదించిన స్థలాల అనుకూలతపై ఉదయం 10 గంటల నుంచి పరిశీలన ప్రారంభమవుతుంది. అనంతరం మధ్యాహ్నం 1:30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జిల్లాలో పలు ప్రైవేట్ కార్యక్రమాల్లో ఎంపీ పాల్గొంటారు. ఈ మేరకు ఎంపీ క్యాంప్ కార్యాలయం నుంచి ఆదివారం సాయంత్రం ఓ ప్రకటన వెలువడింది.

## ఓటర్ల జాబితాపై ప్రత్యేక నిఘా

- **బీఎల్ఓలకు ఆర్డీవో కీలక సూచనలు**



**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 06 (తెలంగాణ ముచ్చట్లు):** ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో భాగంగా జమ్మికుంట పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ప్రచార దినోత్సవం కార్యక్రమాన్ని హుజూరాబాద్ ఆర్డీవో పరిశీలించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో సందర్శించి బూత్ స్థాయి అధికారుల పనితీరును పరిశీలించారు. ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తులు, అభ్యంతరాలు, మార్పులు-చేర్పుల ప్రక్రియపై బీఎల్ఓలను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణలో ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్ల నుంచి వచ్చే దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని బీఎల్ఓలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రత్యేక ప్రచార దినోత్సవం సందర్భంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు అవసరమైన సమాచారం అందించి, వారి సందేహాలను నివృత్తి చేయాలని అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా జరిగేలా క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి. సుధాకర్, డిప్యూటీ తహశీల్దార్ శంకర్, గిర్దావర్ సత్యనారాయణ, జీపీఓలు శ్రావణ్, రాజ్ కిరణ్, హరీష్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.



# నీలాకాశం కోసం స్వచ్ఛమైన గాలి అవసరం

- స్వచ్ఛమైన గాలి దినోత్సవం ఆవిర్భావం
- పెరుగుతున్న గాలి కాలుష్యం
- ఆరోగ్యంపై ప్రభావాలు
- పట్టణీకరణ, పరిశ్రమల సవాళ్లు
- సమిష్టి కృషితోనే పరిష్కారం

**డెస్క్, సెప్టెంబర్ 6, (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 7న అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి దినోత్సవాన్ని నిర్వహిస్తారు. గాలి కాలుష్యం వల్ల ఏర్పడుతున్న ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన పెంచడం, పరిశుభ్రమైన గాలి అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలు, సంస్థలు, పౌరులను చైతన్యపరచడం ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యం. మనిషి ఆహారం లేకుండా కొన్ని రోజులు, నీరు లేకుండా కొంతకాలం జీవించగలడు. కానీ గాలి లేకుండా కొన్ని నిమిషాలకంటే ఎక్కువ కాలం బతకలేడు. అలాంటి గాలి నాణ్యత రోజురోజుకూ క్షీణిస్తుండటం ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తోంది.

పారిశ్రామికీకరణ, వేగవంతమైన పట్టణీకరణ, వాహనాల సంఖ్య పెరగడం, ఇంధనాల అధిక వినియోగం కారణంగా గాలి కాలుష్యం తీవ్రమవుతోంది. నగరాల్లో పొగ, ధూళి, రసాయన కణాలు వాతావరణంలో కలవడంతో శ్వాస తీసుకోవడం కూడా కష్టమవుతోంది. ఒకప్పుడు నిర్మలంగా కనిపించిన ఆకాశం ఇప్పుడు పొగమంచుతో కమ్ముకుపోయే పరిస్థితులు అనేక ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. అభివృద్ధి పేరుతో ప్రకృతిని నిర్లక్ష్యం చేయడం వల్ల మనం స్వయంగా మన ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాం. గాలి కాలుష్యం మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. శ్వాసకోశ వ్యాధులు, ఆస్తమా, ఊపిరితిత్తుల సమస్యలు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి అనేక వ్యాధులకు ఇది ప్రధాన కారణంగా మారుతోంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు కాలుష్య ప్రభావానికి ఎక్కువగా గురవుతున్నారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది గాలి కాలుష్యంతో సంబంధం ఉన్న ఆరోగ్య సమస్యల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని వివిధ అధ్యయనాలు సూచిస్తున్నాయి. అందువల్ల స్వచ్ఛమైన గాలి అనేది విలాసం కాదు, ప్రతి మనిషి ప్రాథమిక హక్కు.

వేగంగా విస్తరిస్తున్న నగరాలు గాలి కాలుష్యానికి కేంద్రాలుగా మారుతున్నాయి. పెరుగుతున్న నిర్మాణ కార్యకలాపాలు, పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్య వాయువులు, వాహనాల నుంచి వచ్చే పొగ వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. జనాభా పెరుగుదలతో పాటు ఇంధన అవసరాలు కూడా పెరుగుతుండటంతో సమస్య మరింత తీవ్రమవుతోంది. అభివృద్ధి అవసరమే అయినప్పటికీ అది పర్యావరణ పరిరక్షణకు విరుద్ధంగా ఉండకూడదు. స్థిరమైన అభివృద్ధి విధానాల ద్వారానే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

గాలి కాలుష్యం కేవలం ఆరోగ్య సమస్య మాత్రమే కాదు, వాతావరణ మార్పులకు కూడా ప్రధాన కారణాల్లో ఒకటి. శిలాజ ఇంధనాల దహనం వల్ల విడుదలయ్యే వాయువులు భూతాపాన్ని పెంచుతున్నాయి. దీనివల్ల ఉష్ణోగ్రతలు పెరగడం, అసాధారణ వర్షాలు, కరువులు, తుఫాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాలు ఎక్కువ అవుతున్నాయి. కాబట్టి గాలి కాలుష్యాన్ని తగ్గించడం అంటే కేవలం మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మాత్రమే కాదు, భూమి భవిష్యత్తును కూడా రక్షించడం.

ఈ సమస్యను ఎదుర్కోవడంలో ప్రభుత్వాల పాత్ర అత్యంత కీలకం. కాలుష్య నియంత్రణ చట్టాలను కఠినంగా అమలు చేయడం, పరిశ్రమలపై పర్యవేక్షణ పెంచడం, స్వచ్ఛమైన ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడం, ప్రజా రవాణా వ్యవస్థలను బలోపేతం చేయడం వంటి చర్యలు అవసరం. పర్యావరణానికి హాని కలిగించే కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పునరుత్పాదక శక్తి వనరుల వినియోగాన్ని విస్తరించాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరం. వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించడం, ప్రజా రవాణాను ప్రోత్సహించడం, అవసరం లేని ఇంధన వినియోగాన్ని నివారించడం, చెత్తను బహిరంగంగా తగలబెట్టకుండా ఉండటం వంటి చిన్న చిన్న చర్యలు కూడా గాలి నాణ్యత మెరుగుపడటానికి దోహదపడతాయి. పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని ప్రతి పౌరుడు గుర్తించాలి. పచ్చదనం పెంపొందించడం గాలి కాలుష్య నియంత్రణలో అత్యంత ప్రభావవంతమైన మార్గాల్లో ఒకటి. చెట్లు కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. అందువల్ల పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా పెద్ద ఎత్తున వృక్షారోపణ కార్యక్రమాలు చేపట్టాలి. ఇప్పటికే ఉన్న అడవులను సంరక్షించడంతో పాటు కొత్తగా పచ్చదనాన్ని పెంచే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రకృతితో సమతుల్యతను కాపాడుకోవడం ద్వారానే స్వచ్ఛమైన గాలి సాధ్యమవుతుంది.

భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని అందించాలంటే నేటి నుంచే చర్యలు ప్రారంభించాలి. పిల్లలు స్వచ్ఛమైన గాలిని పీల్చే హక్కును కోల్పోకుండా చూడటం మన బాధ్యత. కాలుష్యాన్ని నియంత్రించడంలో విఫలమైతే రానున్న తరాలు మరింత తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందువల్ల పర్యావరణ పరిరక్షణను తాత్కాలిక కార్యక్రమంగా కాకుండా దీర్ఘకాలిక బాధ్యతగా భావించాలి.

అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి దినోత్సవం మనకు ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తోంది. స్వచ్ఛమైన గాలి లేకుండా ఆరోగ్యవంతమైన జీవితం అసాధ్యం. గాలి కాలుష్య నియంత్రణ కోసం ప్రభుత్వాలు, పరిశ్రమలు, శాస్త్రవేత్తలు, పౌరులు కలిసి పనిచేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయి. నీలాకాశం కింద పరిశుభ్రమైన గాలిని ఆస్వాదించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. ఆ హక్కును కాపాడుకోవడం కోసం సమిష్టి కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైంది.

# ఆరోగ్యవంతమైన భారతానికి పోషకాహారమే పునాది

- పోషకాహారం ప్రాముఖ్యత
- పోషకాహార లోపం సవాళ్లు
- పిల్లల ఆరోగ్యంపై ప్రభావం
- మహిళల పోషణ అవసరం
- యువతలో మారుతున్న ఆహారపు అలవాట్లు
- భవిష్యత్తుకు పోషకాహార భద్రత



**డెస్క్, సెప్టెంబర్ 6, (తెలంగాణ ముచ్చట్లు):** సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించే జాతీయ పోషకాహార వారోత్సవం నేడు ముగుస్తోంది. ప్రజల్లో పోషకాహారం పట్ల అవగాహన పెంపొందించడం, సమతుల ఆహారం ప్రాముఖ్యతను తెలియజేయడం, ఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహించడం ఈ వారోత్సవం ప్రధాన లక్ష్యం. ఆహారం మనిషి జీవనానికి మూలాధారం అయినప్పటికీ, అందులోని పోషక విలువల గురించి అవగాహన లేకపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. అందుకే ప్రతి ఏడాది ఈ వారోత్సవాన్ని నిర్వహిస్తూ ప్రజలకు సరైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పిస్తున్నారు. ఒక దేశ అభివృద్ధిని కేవలం ఆర్థిక ప్రగతితోనే కాకుండా ప్రజల ఆరోగ్య స్థితితో కూడా కొలుస్తారు. ఆ ఆరోగ్యానికి పునాది పోషకాహారమే.

భారతదేశం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా ఎదిగినప్పటికీ పోషకాహార లోపం సమస్య ఇంకా పూర్తిగా తొలగిపోలేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లో సరైన పోషకాహారం అందకపోవడం వల్ల పిల్లలు ఎదుగుదలలో వెనుకబడుతున్నారు. మరోవైపు పట్టణ ప్రాంతాల్లో అధిక కేలరీలు ఉన్న ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం వల్ల ఊబకాయం, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఈ రెండు పరిస్థితులు కూడా ఆరోగ్యానికి ప్రమాదకరమే. కాబట్టి తక్కువ తినడం కాదు, సరైన పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవడమే అసలు అవసరం.

పిల్లల ఎదుగుదలలో పోషకాహారం పాత్ర అత్యంత కీలకం. జీవితంలోని తొలి వెయ్యి రోజులు పిల్లల శారీరక, మానసిక వికాసానికి అత్యంత ముఖ్యమైన కాలంగా భావిస్తారు. ఈ దశలో సరైన పోషకాహారం అందకపోతే వారి ఎదుగుదలపై శాశ్వత ప్రభావం పడే ప్రమాదం ఉంటుంది. రక్తహీనత, బలహీనత, తక్కువ బరువు, చదువులో వెనుకబాటు వంటి సమస్యలు పోషకాహార లోపం వల్లే ఎక్కువగా కనిపిస్తాయి. ఆరోగ్యవంతమైన బాల్యం ఉన్నప్పుడే బలమైన యువత, సమర్థవంతమైన భవిష్యత్ పౌరులు తయారవుతారు.

మహిళల ఆరోగ్యం కూడా పోషకాహారంతో ముడిపడి ఉంటుంది. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు సరైన ఆహారం తీసుకోకపోతే తల్లి ఆరోగ్యంతో పాటు శిశువు ఆరోగ్యం కూడా ప్రభావితమవుతుంది. అనేక ప్రాంతాల్లో మహిళలు కుటుంబ సభ్యులందరికీ ఆహారం పెట్టిన తర్వాత మాత్రమే తినే పరిస్థితి ఇప్పటికీ కనిపిస్తోంది. దీనివల్ల వారికి అవసరమైన పోషకాలు అందడం లేదు. మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడం అంటే కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడినట్లే. ఎందుకంటే ఒక ఆరోగ్యవంతమైన తల్లి సమాజానికి ఆరోగ్యవంతమైన తరాన్ని అందిస్తుంది.

ప్రస్తుతం యువతలో ఆహారపు అలవాట్లు వేగంగా మారుతున్నాయి. ఇంటి వంటల కంటే తక్షణ ఆహారాలు, బయట లభించే పదార్థాలు, అధిక చక్కెరలతో కూడిన పానీయాలు ఎక్కువగా వినియోగిస్తున్నారు. రుచికి ప్రాధాన్యం పెరగడంతో పోషక విలువలు రెండో స్థానానికి వెళ్లిపోతున్నాయి. ఇది భవిష్యత్తులో అనేక ఆరోగ్య సమస్యలకు కారణమవుతుంది. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలంటే యువత ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది. శారీరక శ్రమ, వ్యాయామం, సరైన నిద్ర కూడా ఆహారంతో సమానంగా ముఖ్యం. మన సంప్రదాయ ఆహార విధానాల్లోనే అనేక పోషక విలువలు దాగి ఉన్నాయి. చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు, పాలు, గుడ్లు వంటి పదార్థాలు తక్కువ ఖర్చుతోనే ఎక్కువ పోషకాలను అందిస్తాయి. కానీ ఆధునిక జీవనశైలిలో వీటి వినియోగం తగ్గిపోతోంది. విదేశీ ఆహారాలపై ఆకర్షణ పెరిగినా స్థానిక ఆహారాల విలువను మరచిపోకూడదు. మన పూర్వీకులు అనుసరించిన ఆహార పద్ధతులు ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని శాస్త్రీయ పరిశోధనలు కూడా సూచిస్తున్నాయి.

పోషకాహార సమస్యను ఎదుర్కోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజన పథకం, గర్భిణీలు మరియు బాలింతల కోసం ప్రత్యేక పోషకాహార కార్యక్రమాలు చేపడుతున్నారు. రక్తహీనత నిర్మూలన కోసం కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అయితే ప్రభుత్వ కార్యక్రమాలు మాత్రమే సరిపోవు. ప్రజల్లో అవగాహన పెరగడం, ఆహారపు అలవాట్లలో మార్పు రావడం కూడా అంతే ముఖ్యం. ప్రతి కుటుంబం ఈ విషయంలో చైతన్యంతో వ్యవహరించాలి.

పోషకాహారంపై అవగాహన కల్పించడంలో కుటుంబ సభ్యుల పాత్ర ఎంతో కీలకం. పిల్లలకు చిన్నప్పటి నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు నేర్పాలి. తల్లిదండ్రులు స్వయంగా మంచి అలవాట్లను పాటిస్తే పిల్లలు కూడా వాటిని అనుసరిస్తారు. రోజువారీ ఆహారంలో పండ్లు, కూరగాయలు, పాలు, పప్పులు ఉండేలా చూసుకోవాలి. ఆహారం విషయంలో నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలకు భారీ ఖర్చు చేయాల్సి వస్తుంది.

పోషకాహారం అనేది కేవలం ఆరోగ్యానికి మాత్రమే కాదు, దేశ ఆర్థికాభివృద్ధికి కూడా సంబంధించిన అంశం. ఆరోగ్యవంతమైన ప్రజలు ఎక్కువ ఉత్పాదకతతో పని చేయగలరు. అనారోగ్య సమస్యలు తగ్గితే వైద్య ఖర్చులు కూడా తగ్గుతాయి. దీంతో కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడటమే కాకుండా దేశ అభివృద్ధికి కూడా తోడ్పాటు లభిస్తుంది. అందువల్ల పోషకాహారాన్ని వ్యక్తిగత అంశంగా కాకుండా జాతీయ అభివృద్ధికి సంబంధించిన అంశంగా చూడాల్సిన అవసరం ఉంది.

జాతీయ పోషకాహార వారోత్సవం చివరి రోజు మనందరికీ ఒక స్పష్టమైన సందేశాన్ని అందిస్తోంది. ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం పోషకాహారం ప్రతి ఇంటిలో, ప్రతి వ్యక్తి జీవితంలో భాగం కావాలి. సమతుల ఆహారం, క్రమబద్ధమైన జీవనశైలి, శారీరక శ్రమ, ఆరోగ్యంపై అవగాహన కలిసొచ్చినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది. ఈ వారోత్సవాన్ని ఒక వారానికి మాత్రమే పరిమితం చేయకుండా ప్రతి రోజూ పోషకాహారం గురించి ఆలోచించే అలవాటును పెంపొందించుకోవాలి. ఆరోగ్యమే మహాభాగ్యం అనే సత్యాన్ని గుర్తుంచుకొని పోషకాహారాన్ని జీవితంలో భాగం చేసుకుంటేనే బలమైన, ఆరోగ్యవంతమైన భారతదేశం నిర్మించగలం.

# గోవాలో ఫ్రెంచ్ నౌకాదళ నౌక 'లాంగ్వెడాక్' స్నేహపూర్వక పర్యటన

- భారత, ఫ్రెంచ్ నౌకాదళాల మధ్య వృత్తిపరమైన పరస్పర చర్చలు
- విద్యార్థులకు నౌక సందర్శన అవకాశం
- సముద్ర భద్రత సహకారానికి మరింత బలం
- స్నేహపూర్వక దేశాలతో సంబంధాల బలోపేతమే లక్ష్యం



**గోవా, సెప్టెంబర్ 6, (తెలంగాణ ముచ్చట్లు):** ఫ్రాన్స్ నౌకాదళానికి చెందిన యుద్ధ నౌక 'లాంగ్వెడాక్' స్నేహపూర్వక పర్యటనలో భాగంగా గోవాకు చేరుకుంది. ఈ సందర్భంగా భారత నౌకాదళం, ఫ్రెంచ్ నౌకాదళం మధ్య పలు వృత్తిపరమైన పరస్పర చర్చలు, అనుభవాల మార్పిడి కార్యక్రమాలు నిర్వహించారు. ఇరు దేశాల నౌకాదళాల మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాలను మరింత బలోపేతం చేయడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశంగా అధికారులు తెలిపారు. పర్యటనలో భాగంగా ఇరు దేశాల నౌకాదళ సిబ్బంది పరస్పరం నౌకలను సందర్శించి కార్యకలాపాలపై అవగాహన పెంపొందించుకున్నారు. సముద్ర భద్రత, నౌకాదళ నిర్వహణ, ఆధునిక సాంకేతికత వినియోగం వంటి అంశాలపై చర్చలు జరిపారు. ఈ పరస్పర కార్యక్రమాలు ఇరు దేశాల నౌకాదళాల మధ్య సమన్వయాన్ని మరింత పెంచనున్నాయని భావిస్తున్నారు.

జాతీయ క్యాడెట్ దళం సముద్ర విభాగానికి చెందిన గోవా విద్యార్థులకు కూడా ఫ్రెంచ్ నౌకను సందర్శించే అవకాశం కల్పించారు. విద్యార్థులు నౌకలోని వివిధ విభాగాలను పరిశీలించి అక్కడి సాంకేతిక వ్యవస్థలు, భద్రతా ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్శన యువతలో సముద్ర భద్రత, నౌకాదళ సేవలపై ఆసక్తిని పెంపొందించేలా ఉందని అధికారులు తెలిపారు. భారత్, ఫ్రాన్స్ మధ్య రక్షణ రంగంలో సహకారం గత కొన్ని సంవత్సరాలుగా మరింత బలపడుతోంది. నౌకాదళాల మధ్య సంయుక్త విన్యాసాలు, శిక్షణ కార్యక్రమాలు, సాంకేతిక సహకారం వంటి అంశాలు ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తున్నాయి. గోవా పర్యటన కూడా ఆ సహకారానికి మరో నిదర్శనంగా నిలిచింది.

సముద్ర భద్రత, ప్రాంతీయ స్థిరత్వం, అంతర్జాతీయ జలాల్లో సహకారాన్ని పెంపొందించేందుకు ఇలాంటి స్నేహపూర్వక పర్యటనలు కీలక పాత్ర పోషిస్తున్నాయని నౌకాదళ అధికారులు పేర్కొన్నారు. పరస్పర అవగాహన, నైపుణ్యాల మార్పిడి ద్వారా ఇరు దేశాలు తమ సామర్థ్యాలను మరింత మెరుగుపరుచుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. స్నేహపూర్వక దేశాలతో నిర్మాణాత్మక సహకారం, పరస్పర అభివృద్ధికి భారత్ కట్టుబడి ఉందని భారత నౌకాదళం వెల్లడించింది. ఫ్రెంచ్ నౌకాదళ నౌక లాంగ్వెడాక్ గోవా పర్యటన ఇరు దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు సముద్ర భద్రత రంగంలో సహకారానికి కొత్త ఊపునివ్వనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.



# హర్మన్‌ప్రీత్ అరుదైన ప్రపంచ రికార్డు!

**దుబాయ్, సెప్టెంబర్ 06 (తెలంగాణ ముచ్చట్లు):** భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అరుదైన ప్రపంచ రికార్డు సృష్టించింది. పురుషుల, మహిళల క్రికెట్‌లో ఇప్పటివరకు ఏ కెప్టెన్‌కూ సాధ్యం కాని రీతిలో 150 అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లకు సారథ్యం వహించిన తొలి క్రికెటర్‌గా చరిత్రలో నిలిచింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన ఆసియా కప్ మ్యాచ్‌లో ఈ ఘనత సాధించడంతో ఆమె రికార్డు మరింత ప్రత్యేకంగా మారింది.

దుబాయ్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ ఏకపక్ష ప్రదర్శన చేసింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ భారత బౌలర్ల ధాటికి 18.1 ఓవర్లలో కేవలం 55 పరుగులకే కుప్పకూలింది. టీ20 క్రికెట్‌లో పాకిస్థాన్‌కు ఇదే అత్యల్ప స్కోరుగా నిలిచింది. ఒక దశలో 27 పరుగులకు వికెట్ నష్టపోకుండా ఉన్న పాక్.. ఆ తర్వాత కేవలం 28 పరుగుల వ్యవధిలోనే మిగిలిన పది వికెట్లను కోల్పోయింది. భారత స్పిన్నర్లు పాకిస్థాన్ పతనంలో కీలక పాత్ర పోషించారు. శ్రీ చరణి మూడు వికెట్లు, ప్రేమ రావత్ మూడు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి బ్యాటింగ్ వెన్ను విరిచారు. దీప్తి శర్మ రెండు వికెట్లు తీసి వారికి అండగా నిలిచింది. భారత బౌలర్ల సమష్టి ప్రదర్శనతో పాకిస్థాన్ భారీగా తడబడింది.

అనంతరం 56 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు కూడా ఆరంభంలో ఎదురుదెబ్బ తగిలింది. షఫాలీ వర్మ 12, స్మృతి మంధాన 9 పరుగులకే పెవిలియన్‌కు చేరారు. అయితే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ బాధ్యతాయుతంగా బ్యాటింగ్ చేసి జట్టును విజయతీరాలకు చేర్చింది. 18 పరుగులతో అజేయంగా నిలిచిన ఆమె.. సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించింది. పాకిస్థాన్‌పై విజయం సాధించిన భారత్ గ్రూప్ 'ఎ'లో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. మరోవైపు హర్మన్‌ప్రీత్ కౌర్ 150 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లకు నాయకత్వం వహించిన తొలి క్రికెటర్‌గా నిలవడం భారత క్రికెట్‌లో ప్రత్యేక ఘట్టంగా మారింది. విజయం అనంతరం హర్మన్‌ప్రీత్ మాట్లాడుతూ.. పాకిస్థాన్‌పై ఎలాంటి కనికరం లేకుండా ఆడాలనే స్పష్టమైన ప్రణాళికతో బరిలోకి దిగామని తెలిపింది. తమ వ్యూహాలను మైదానంలో పక్కాగా అమలు చేయగలిగినందుకు సంతోషంగా ఉందని పేర్కొంది. అరుదైన సారథ్య రికార్డుతో పాటు పాకిస్థాన్‌పై ఘన విజయం సాధించడంతో హర్మన్‌ప్రీత్ కౌర్‌కు ఈ మ్యాచ్ చిరస్మరణీయంగా నిలిచింది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# టీఎంజెఎఫ్ రాష్ట్ర మహాసభ కరపత్రాలు ఆవిష్కరణ

**హన్మకొండ,సెప్టెంబర్6 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరమ్ (టీఎంజెఎఫ్) రాష్ట్ర 3వ మహాసభకు సంబంధించిన కరపత్రాలను దళిత నాయకులు ఆవిష్కరించారు. హన్మకొండలో ఆదివారం టీఎంజెఎఫ్ రాష్ట్ర నాయకులు పసుల తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీ పసునూరి దయాకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంగారపు అమృతరావు, నమిండ్ల శ్రీనివాస్, విద్యావేత్త జన్ను పరంజ్యోతి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాదిగ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంతో పాటు, జర్నలిజం రంగంలో వారి హక్కులు, ప్రాతినిధ్యం కోసం టీఎంజెఎఫ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సమాజంలోని అణగారిన వర్గాల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. టీఎంజెఎఫ్ రాష్ట్ర 3వ మహాసభను విజయవంతం చేసేందుకు జర్నలిస్టులు, దళిత సంఘాల నాయకులు, ప్రజాస్వామికవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మహాసభలో జర్నలిస్టుల సమస్యలు, హక్కులు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎంజెఎఫ్ నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# సూరి-సుహాస్ 'మండాడి' ట్రైలర్ అదిరింది!




**చెన్నై, సెప్టెంబర్ 06 (తెలంగాణ ముచ్చట్లు):** తమిళ నటుడు సూరి కథానాయకుడిగా, తెలుగు నటుడు సుహాస్ ప్రతినాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'మండాడి'. సముద్రం నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ హైవోల్టేజ్ యాక్షన్ చిత్రానికి దర్శకుడు మతిమారన్ పుగళేంది కథ అందించి తెరకెక్కిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ సృజనాత్మక నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్ర ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది.

ట్రైలర్‌ను పరిశీలిస్తే.. తమిళనాడులోని తీర ప్రాంతాల్లో జరిగే సాంప్రదాయ పడవ పోటీల నేపథ్యంలో కథ సాగుతున్నట్లు తెలుస్తోంది. సముద్రం, పడవల పోటీలు, గ్రామీణ నేపథ్యం, భావోద్వేగాలు, యాక్షన్ అంశాలను మేళవించి చిత్రాన్ని రూపొందించినట్లు ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది. సూరి పాత్రను చాలా విభిన్నంగా చూపించినట్లు కనిపిస్తుండగా.. సుహాస్ ప్రతినాయకుడి పాత్రలో సరికొత్త అవతారంలో కనిపిస్తున్నాడు.

సూరి సరసన మహిమా నంబియార్ కథానాయికగా నటిస్తోంది. సుహాస్‌తో పాటు సీనియర్ నటుడు సత్యరాజ్, రవీంద్ర విజయ్, బాల శరవణన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. కథలో సముద్రం, పడవ పోటీలు ప్రధానమైన అంశాలుగా ఉండటంతో యాక్షన్ సన్నివేశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది.

ఈ చిత్రానికి జి.వి. ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ట్రైలర్‌లో వినిపించిన నేపథ్య సంగీతం ఆకట్టుకునేలా ఉండటంతో సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా సముద్రంలో చిత్రీకరించిన యాక్షన్ సన్నివేశాలు, పడవ పోటీ దృశ్యాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా కనిపిస్తున్నాయి.

సూరితో పాటు సుహాస్ కూడా ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డట్లు చిత్రబృందం తెలిపింది. సముద్రంలో జరిగే ప్రమాదకరమైన యాక్షన్ సన్నివేశాలు, పడవ పోటీ సన్నివేశాల్లో ఇద్దరూ స్వయంగా పాల్గొన్నట్లు సమాచారం. ఎలాంటి డూప్‌లను ఉపయోగించకుండా కొన్ని సాహసోపేతమైన సన్నివేశాల్లో నటించినట్లు తెలుస్తోంది.

ఇప్పటివరకు విభిన్న కథలు, పాత్రలతో తన నటనను చూపించిన సుహాస్.. 'మండాడి'లో ప్రతినాయకుడిగా ఎలా మెప్పిస్తాడన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు సూరి కూడా కథానాయకుడిగా యాక్షన్ ప్రధానమైన పాత్రలో కనిపించడంతో ఈ చిత్రం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సెప్టెంబర్ 10న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో ట్రైలర్‌కు వస్తున్న స్పందన చిత్రంపై అంచనాలను మరింత పెంచుతోంది.



# తనూశ్రీ దత్తా సంచలన హెచ్చరిక!

బాలీవుడ్ నటి, మాజీ మిస్ ఇండియా యూనివర్స్ తనూశ్రీ దత్తా మరోసారి సామాజిక మాధ్యమాల్లో సంచలన వ్యాఖ్యలు చేశారు. తన జీవితంలో ఇబ్బందులు సృష్టించినవారు, వృత్తిపరంగా తన ఎదుగుదలకు అడ్డుపడినవారు కర్మ ఫలితాన్ని అనుభవించక తప్పదని పేర్కొన్నారు. తనకు అన్యాయం చేసిన వారి పతనాన్ని తాను చూస్తానంటూ తీవ్ర వ్యాఖ్యలతో సామాజిక మాధ్యమాల్లో ఓ సందేశాన్ని పంచుకున్నారు. తనూశ్రీ తన సామాజిక మాధ్యమాల కథనంలో.. తన సహజమైన జీవిత ప్రయాణాన్ని అడ్డుకుని, ఎలాంటి తప్పు చేయకపోయినా తనను బాధపెట్టినవారికి భవిష్యత్తులో తగిన పరిణామాలు ఎదురవుతాయని పేర్కొన్నారు. తన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలు మళ్లీ అద్భుతంగా పుంజుకుంటాయని ధీమా వ్యక్తం చేశారు. తనపై కుట్రలు చేసి, మానసికంగా వేధించి, నిఘా పెట్టి ఇబ్బందులకు గురిచేశారని ఆమె ఆరోపించారు. కర్మ సిద్ధాంతాన్ని ప్రస్తావిస్తూ.. ప్రతి ఒక్కరూ తమ చర్యలకు తగిన ఫలితాన్ని అనుభవించాల్సిందేనని తనూశ్రీ పేర్కొన్నారు. తనను బాధించినవారు భవిష్యత్తులో తమ చర్యల పర్యవసానాలను ఎదుర్కొంటారని వ్యాఖ్యానించారు. అయితే ఆమె చేసిన ఈ ఆరోపణలకు సంబంధించి పూర్తి వివరాలు, ఆధారాలపై స్పష్టత లేదు.

గత నెలలోనూ తనూశ్రీ తన కెరీర్‌కు సంబంధించి సంచలన ఆరోపణలు చేశారు. కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా తనకు అవకాశాలు రాకుండా అడ్డుకుంటున్నారని ఆమె ఆరోపించారు. మంచి చిత్రాలు, వాణిజ్య ప్రకటనల్లో నటించే అవకాశాలు వచ్చినప్పటికీ.. కొందరు వాటిని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన కెరీర్‌ను దెబ్బతీసేందుకు ఓ వర్గం ప్రయత్నిస్తోందని గతంలోనూ ఆమె పేర్కొన్నారు.

2018లో బాలీవుడ్‌లో సంచలనం సృష్టించిన మీటూ ఉద్యమం సమయంలో తనూశ్రీ దత్తా చేసిన ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. 2008లో 'హార్న్ ఓకే ప్లీజ్' సినిమా చిత్రీకరణ సమయంలో సీనియర్ నటుడు నానా పటేకర్ తనతో అనుచితంగా ప్రవర్తించారని ఆమె బహిరంగంగా ఆరోపించారు. ఈ ఆరోపణలను నానా పటేకర్ ఖండించిన విషయం తెలిసిందే.

అప్పటి నుంచి సినీ పరిశ్రమలో తనకు ఎదురవుతున్న సమస్యలు, కెరీర్‌కు సంబంధించిన ఇబ్బందులపై తనూశ్రీ పలు సందర్భాల్లో స్పందిస్తూ వస్తున్నారు. తాజాగా ఆమె చేసిన కర్మ వ్యాఖ్యలు మరోసారి సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారితీశాయి.

# సంగీత్ శోభన్ కొత్త సినిమా!




**హైదరాబాద్, సెప్టెంబర్ 06 (తెలంగాణ ముచ్చట్లు):** యువ కథానాయకుడు సంగీత్ శోభన్ వరుసగా విభిన్నమైన కథలను ఎంచుకుంటూ టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. తాజాగా మరో ఆసక్తికరమైన చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. మలయాళ నటి అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాకు 'అంతా రాములోరు చూసుకుంటారు' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను చిత్రబృందం ప్రకటించింది. టైటిల్‌తో పాటు విడుదల చేసిన ప్రచార వీడియో సినిమాపై ఆసక్తిని పెంచుతోంది.

ఈ చిత్రంలో సంగీత్ శోభన్ మారుతి పాత్రలో కనిపించనుండగా.. అనస్వర రాజన్ శిరీషగా ప్రేక్షకులను పలకరించనుంది. సాధారణ ప్రేమకథలకు భిన్నంగా ఈ ఇద్దరి మధ్య జరిగే ఓ అందమైన సంభాషణ చుట్టూ కథ సాగనున్నట్లు ప్రచార వీడియో ద్వారా సంకేతాలు ఇచ్చారు. అయితే చిత్రబృందం మాత్రం దీనిని 'ప్రేమకథ కాదు' అనే ఆసక్తికరమైన భావనతో ప్రచారం చేస్తోంది. దీంతో మారుతి, శిరీషల మధ్య అసలు సంబంధం ఏమిటి? వారి జీవితాల్లో ఎలాంటి మలుపులు చోటుచేసుకుంటాయి? అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. అందమైన గోదావరి ప్రాంతాన్ని నేపథ్యంగా తీసుకుని ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అక్కడి పల్లెటూరి వాతావరణం, సంస్కృతి, సహజమైన అందాలను కథలో భాగంగా చూపించనున్నట్లు తెలుస్తోంది. గ్రామీణ నేపథ్యానికి అనుగుణంగా సహజమైన భావోద్వేగాలు, ఆహ్లాదకరమైన సన్నివేశాలు, పాత్రల మధ్య అనుబంధాన్ని ప్రధానంగా చూపించనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.

'కుమారి 21ఎఫ్' చిత్రంతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న పల్నాటి సూర్య ప్రతాప్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. విభిన్నమైన కథను తనదైన శైలిలో ప్రేక్షకులకు అందించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. టైటిల్ ప్రకటన సందర్భంగా విడుదల చేసిన ప్రచార వీడియోలో కనిపించిన దృశ్యాలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి.

ఈ చిత్రానికి మిక్కీ జే. మేయర్ సంగీతం అందిస్తున్నారు. టైటిల్ ప్రకటన వీడియోలో వినిపించిన మెలోడీ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంది. గోదావరి ప్రాంతం నేపథ్యంలో సాగే కథకు ఆయన సంగీతం మరింత అందాన్ని తీసుకురానుందని చిత్రబృందం భావిస్తోంది. ముఖ్యంగా భావోద్వేగ సన్నివేశాలకు సంగీతం కీలకంగా నిలిచే అవకాశం ఉంది.

సీనియర్ నటులు రావు రమేష్, రోహిణి, రఘుబాబు, అలీ, ఝాన్సీ, వినోద్ కుమార్, శివనారాయణ, శ్రీలక్ష్మి తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. యువ నటీనటులతో పాటు అనుభవజ్ఞులైన నటులు కూడా ఉండటంతో సినిమాకు మరింత బలం చేకూరనుంది. టైటిల్, ప్రచార వీడియోతో ఆసక్తి రేకెత్తించిన ఈ సినిమా ఎలాంటి అనుభూతిని అందిస్తుందో తెలియాలంటే విడుదల వరకు వేచి చూడాల్సిందే.

# మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నం!

**హైదరాబాద్, సెప్టెంబర్ 06 (తెలంగాణ ముచ్చట్లు):** జానపద పాటలు, నృత్యాలతో తెలుగు ప్రేక్షకుల్లో గుర్తింపు తెచ్చుకున్న నటి, గాయని మాధురి రాథోడ్ జీవితంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. తోటి జానపద కళాకారుడు ఈశ్వర్ సాయితో కొంతకాలంగా కొనసాగుతున్న వివాదం నేపథ్యంలో తీవ్ర మనోవేదనకు గురైన ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. కుటుంబ సభ్యులు సకాలంలో గుర్తించి ఆమెను రక్షించడంతో ప్రాణాపాయం తప్పినట్లు తెలుస్తోంది.మాధురి రాథోడ్, ఈశ్వర్ సాయిల మధ్య వ్యక్తిగత వివాదానికి సంబంధించిన అంశాలు కొంతకాలంగా సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంలో తనకు అన్యాయం జరిగిందని మాధురి ఆరోపించారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశారని ఆమె గతంలో ఈశ్వర్ సాయిపై ఆరోపణలు చేసినట్లు సమాచారం. ఈ విషయంపై ఆమె పోలీసులను ఆశ్రయించి నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసినట్లు తెలుస్తోంది.ఫిర్యాదు చేసినప్పటికీ తనకు న్యాయం జరగడం లేదని మాధురి తీవ్ర ఆవేదనకు గురైనట్లు సమాచారం. ఈశ్వర్ సాయిపై



చర్యలు తీసుకోవడంలో పోలీసులు జాప్యం చేస్తున్నారని ఆమె అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈశ్వర్ సాయి కూడా తనపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తూ సామాజిక మాధ్యమాల ద్వారా స్పందించినట్లు సమాచారం.ఈ నేపథ్యంలోనే మాధురి తన నివాసంలో తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయాన్ని కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే అప్రమత్తమయ్యారు. తక్షణమే ఆమెను రక్షించి వైద్య చికిత్స కోసం ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. సకాలంలో కుటుంబ సభ్యులు స్పందించడంతో ఆమె ప్రాణాలతో బయటపడినట్లు తెలుస్తోంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in